UNIVERSAL
LIBRARY
OU_204042
UNIVERSAL
LIBRARY

శ్రీ

# శంకరాచార్యచరిత్రము.

ఇది

విక్రమ సింహపుర వాస్తవ్యులు

సంధ్యా సుబ్రహ్మణ్యశర్మగారిచే

రచియింపఁబడినది.

కేసరీ ముద్రాక్షరశాల, చెన్నపురి.

1937

సర్వస్వామ్య సంకలితము] [వెల 0-[illegible]-0.

దత్సిద్ధాంత లేశమును వ్రాసి, బ్ర॥ మ॥ వల్లూరు - జగన్నాథ రాయ రచితమయిన యాంధ్ర శారీరకమునుండి కొంతవిషయము—గొన్ని చిలుతుక మూర్పులను దక్క—యథారూప ముదాహరించితిని. ఈ చరిత్రమువలన ఆంధ్ర మండలమున శంకరుని మహిమానుభావములు ఇప్పటికన్న నెక్కువగాఁ దెలియఁబడునేని, నా ప్రయత్నము సఫలమయ్యెనని తలంచెద.

తే-గీ॥ విస్తరభయమ్ముచేఁ గొంతవిడువవలసె।
పఠితృ దుర్బోధమని కొంత వదలవలసెఁ।
దక్కినరవంతలో నాదు తప్పులెన్నొ!।
శంకరునిజూచి బుధులు నక్షమింపవలయు॥

నెల్లూరు.
29—7—14.

విద్వద్విధేయుఁడు,
దుర్భా-సుబ్రహ్మణ్యశర్మ.

# రెండవ కూర్పు

ఈ చిన్న పుస్తకము తొలుత నిరువదినాలుగు సంవత్సరములనాఁడు 'సుబోధినీ' గ్రంథమాలలో మూఁడవ సుమముగాఁ బ్రకటితమయ్యెను. ఆ ప్రతులన్నియు నెన్నఁడో వెలపోయినను, ఆవలఁ బెక్కేండ్లవఱకు నాకప్పటప్పటికిఁ బుస్తకములకొఱకు జాబులు వచ్చుచుండినను, విషయము విస్తరించి నూత్నకృతి రచియించు తలంపున, దీని దెస నుపేక్షకుఁడనైతిని. ఇఁక నది కానిపనియని తెలిసికొని నా యరయమిని తొలి ముద్రణమున దొరలిన తప్పుల, తక్కుపొరల యథామతి సవరించి యీ రెండవ కూర్పు మరల నాంధ్రులకు ఉపలభ్యము కావించుచున్నాఁడను. ఇందలి సకల దోషముల మనీషులు క్షమింతురుగాక యనియు, మహాజనులు తొలికూర్పుపట్లఁబోలె, దీనియెడను ఆదరాభిమానములు నెఱపుదురుగాక యనియు వేఁడుచున్నాఁడను.

నెల్లూరు,
14-10-1937.

దుర్భా సుబ్రహ్మణ్య శర్మ,
ప్రధానాంధ్ర పండితుఁడు
(వీ. ఆర్. కాలేజి.)

ఆయనతల్లి "పజుర్పణ్ణై" యను పేరుగల యింటివారి యాఁడు పడుచనియు వ్యవహారముగలదు. ఇప్పటికిని "ద్రిచూరు" కు సమీపమున 'నంబూద్రి' బ్రాహ్మణుల తెగలో నీ యింటి పేరుగలవారు ఉన్నారు. శంకరుఁడు తనతల్లికి ఉత్తరక్రియలు జరిపి కొన్ని ప్రతికూలముల వలన నామెశరీరమును ఊరివెలుపలఁగాక, గృహోపకంఠముననే దహనము చేయవలసివచ్చినట్లు, ఈచరిత్రము చదువఁగా విశదపడఁగలదు. అట్టిదహన ప్రదేశమని కేరళీయులు కాలటి గ్రామమందొక్క చోటు నిప్పటికినిజూపెదరు. శంకరుఁడు హిమవత్పర్వతమునకుఁ బోయినప్పుడు అక్కడ బదరికారణ్యమందు నారాయణుని పేర నొక్క దేవాలయముఁ బ్రతిష్ఠించెను. అందుఁ బూజారు లనాది నుండి మళయాళదేశములోని నంబూద్రి తెగబ్రాహ్మణులుగా నున్నారు. శంకరుఁడు ఈ తెగకుఁ జేరిన బ్రాహ్మణుఁడుకావున, ఈయనవెంట నేఁగినయెవ్వఁడేని బదరికాశ్రమమందు నిలిచి ఆ దేవాలయములో అర్చకుఁడుగా నుండుటకు ఒప్పుకొనినట్లును, ఆయాచారమిప్పటికిని అవిచ్ఛిన్నముగా జరుగుచున్నట్లును ఊహింపఁదగియున్నది. ఇదియును శంకరుఁడు మళయాళదేశము వాఁడని చెప్పుటకుఁ గొంతయాధారముగా నున్నది. సౌందర్యలహరి యను పేరఁ దానురచించిన దేవీస్తవములో 75-వ శ్లోకమున శంకరుఁడు తన్ను ద్రవిడశిశువునుగాఁ జెప్పికొనియున్నాఁడు. పరాశక్తి తనకుఁ జన్నిచ్చిన తల్లిగాను, ఆ స్తన్యము సారస్వత రూపముగావునఁ దనకుఁ గవితాసిద్ధిహేతువైనట్టును ఈశ్లోకమున శంకరుని యుత్ప్రేక్ష.

"శ్లో॥ తవ స్తన్యంమన్యే, ధరణిధరకన్యే! హృదయతః
పయఃపారావారం పరివహతి సారస్వతమివ
దయావత్యాదత్తం - ద్రవిడశిశు రాస్వాద్య తవ య
త్కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా॥"

ఈద్రవిడదేశ ప్రసంగము శంకరుఁడు కేరళదేశ సముద్భవుఁడనుటకుఁ గొంత విరోధముగా నున్నది. కాని, ఆధునికులెల్లరు శంకరుని జన్మస్థలము కాలటియనియే నిర్ణయించియుండుటం బట్టియు దీనినంగీకరించి శృంగేరి పీఠాధిపతులుగూడఁ గాలటిలోనే శంకర ప్రతిష్ఠ గావించి యుండుటం బట్టియు, శంకరుఁడు కేరళీయుఁడనుటకు వారలకుఁ బ్రబలతర ప్రమాణములు దొరకియుండవలయునని నేను భావించుచున్నాను. విషయమును బట్టియు, శైలినిబట్టియు సౌందర్యలహరి శంకర విరచిత మనుటకు సంశయములేదు. ఇఁక నీశ్లోకమొక్కండు మాత్రము ఆశతకమందు ఇతరులు రచించి చేర్చియుందురా? కాక, కేరళదేశము శంకరుని కాలమున ద్రవిడదేశములోని యొక్కభాగముగ నుండెనా? ఈయంశము సంశయగ్రస్తముగా నున్నది.

కాలటియనుగ్రామ మొక్కయగ్రహారము. దీనికి సమీపమునఁ బూర్ణానదియు, వృషాచలమును గలవు. ఇవియును గేరళదేశములోనివే. శంకరుఁడు పుట్టుటకుఁ గొన్ని సంవత్సరములకుమున్ను కేరళదేశమును రాజశేఖరుఁడను ప్రభువు పాలించుచుండెను. ఆయనకు స్వప్నమందు శివుఁడు కనఁబడి, తాను జ్యోతిర్లింగాకారముతో వృషాచలసమీప

మున నుద్భవిల్లినట్లు దెలుపుకొనెను. ప్రభువు ఈసుస్వప్నము
నకు మిక్కిలి సంతసిల్లి లింగమున్నచోట నొక దేవాలయ
మును నిర్మించి ప్రక్క నొక్కయగ్రహారమును బ్రతిష్ఠించెను.
ఈప్రకారమేర్పడిన 'కాలటి' అగ్రహారమునకు వచ్చిచేరిన
బ్రాహ్మణులలో విద్యాధిరాజని బిరుదమువహించిన విప్రో
త్తముఁ డొక్కఁడుండెను. ఈయన కుమారుఁడు శివగురుఁడు.
జ్ఞానమందు శివునితోడను, బుద్ధియందు బృహస్పతి (గురువు)
తోడను సమానుఁడు కాఁబట్టి ఈయనకీ పేరుసార్థకమై చెల్లు
చుండెను. ఈయన కాలక్రమమున యౌవనస్థుఁడై, విద్య
లందుఁ దండ్రికన్న నధికుఁడై, యుక్తకాలమునఁ బెండ్లిచేసి
కొనెను. కాని చిరకాలమువఱకు బిడ్డలుగలుగనందునఁ
జింతిల్లి ఈయన భార్యాసహితముగా ఈశ్వరునారాధింపఁ
దొడఁగెను. ఈ యారాధనకుఫలముగా శివుఁడు ప్రసన్నుఁడై
తన తేజస్సును శివగురునిభార్య యార్యాదేవిగర్భమందుఁ
బ్రవేశింపఁజేసి తానే శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులుగా
లోకానుగ్రహముకొఱకుఁ గాలటియందు అవతరించెను.

శంకరుని జన్మమును గూర్చి కొన్నికథలు కలవు గాని
యవి నమ్మఁదగినవికావు. కాలటిలో జవ్వనమందే వైధవ్య
మొందిన యొకయిల్లాలు ముత్తైదువలైన తోడి చెలికత్తెల
తోడ తనకునుఁ గొడుకు గలుగవలయునని పరిహాసముతో
నక్కడిగుడిలోని ఈశ్వరునకు మ్రొక్కుకొనియెననియు, అఘట
నఘటనాధురీణుఁడైన భగవంతుఁ డామె గర్వభంగము
కొఱకుఁ దనతేజస్సువలన నామెకు గర్భధారణము వెలయించె

వనియు, శంకరునిజన్మ మిట్టిదనియు మళయాళదేశమునందలి కొన్నిభాగములలోఁ బ్రతీతికలదు. అటుగాక, శంకరుఁడు చిదంబరమునందుఁ దపోనిష్ఠుఁడై చిరకాలముక్రింద నడవికివెళ్లిన సోమకబ్రాహ్మణుని భార్యకు, నటేశ్వరుని వరప్రసాదమున జనియించెనని వేఱొక్కకథకలదు. ఈకథ యొక్కటిగాని మాధవాచార్యుని శంకర విజయమందు లేమింజేసియు, మాధవాచార్యునికన్న శంకరునిచరిత్ర సర్వంకషముగా నెఱుఁగుటకు ఇతరులకు అవకాశము లేమింజేసియు, ఈకథలు కల్పితములుగా భావింపఁదగియున్నవి. శంకరుఁడు శివావతారమని సూచించుటకై తదభిమానులో ఆయనకు లాఘవము కలిగించుటకై తత్ప్రతిపక్షులో ఈకథలు కల్పించి యుండవచ్చును. ఇట్టి ప్రతికూల కథలవలనఁగూడ, శ్రీశంకర భగవత్పాదాచార్యులవారి జనన మసామాన్యమైనదనియు, శివప్రసాద హేతుకమనియుః నేర్పడుచున్నది.

## జన్మకాలము

శంకరుఁడు ఏసంవత్సరమున జననమొందినదియు నిర్ణయించుటకుఁ జాలినంత సాధనసామగ్రిలేదు. ఈదేశములోఁ బూర్వము చరిత్రలు రచించుపద్ధతి లేకుండుటంబట్టి, అధునాతన విమర్శకులవలననే మనము విషయము గ్రహింపవలసియున్నది. కాని, వీరివిమర్శనములు భిన్నరూపములై చిత్తభ్రమణకరములుగా నున్నవి. వానినెల్ల నిందుదాహరించుట యనావశ్యకమని మానివేయుచున్నాను. మాధవాచార్యులు తన గ్రంథమందు శంకరుని జననకాలమప్పటి గ్రహస్థితినిబొందు

పఠించెను గాని, దానినిబట్టి కాలనిర్ణయముచేయుట దుర్ఘటముగా నున్నది. అయినను, ఆ గ్రంథమునుబట్టిచూడఁగా, శంకరుని దిగ్విజయకాలమునకు బౌద్ధులు కాశ్మీర దేశములోను, హిమాలయప్రాంత దేశములలోను ఉన్న ట్లేర్పడుచున్నది. మగధదేశము బౌద్ధులకు విహారరంగమై, మగధరాజులు బౌద్ధమతమునకు ముఖ్యపోషకులై యున్న యంశము మనకు దేశచరిత్రలవలన విస్పష్టముకదా! ఈగ్రంథమందు మగధరాజ్యప్రశంసయే లేనికారణమువలన, శంకరుని దిగ్విజయకాలమునకు మగధరాజ్యము క్షీణించియుండెనని తలంపవలసియున్నది. మగధరాజ్యము ఏడవశతాబ్ది మధ్యభాగములో అత్యున్నతిలో నుండెననియు, దేశమందెల్ల బౌద్ధమతము ప్రబలియుండెననియు, చీనాదేశమునుండి హిందూస్థానమును సందర్శింప వచ్చిన (Hieun Tsang) హాయూన్ త్సాంగ్ అను దేశాటకుని వ్రాఁతవలనఁ దెలియుచున్నది. మగధరాజ్యములో బౌద్ధమతము క్రుంగిపోవుటకుఁ బట్టినకాలము నూటయేఁబదిసంవత్సరములు కానోపునని లెక్కపెట్టుకొనఁగా, శంకరుని దిగ్విజయకాలము ఇంచుమించుగా ఎన్మిదవశతాబ్ది ఆదిభాగమని యేర్పడును. ఇట్టి యూహలచేతను, శృంగగిరి-విరూపాక్షాదిపీఠములలో దొరకిన సాధనాంతరములచేతను, ఆధునికులలోఁ బెక్కండ్రు శంకరుఁడు క్రీస్తుశకము 788 సంవత్సరమున జన్మించియుండవలయునని నిర్ణయించియున్నారు.

# ద్వితీయాధ్యాయము.

## శైశవము.

సామాన్యులైన పిల్లవాండ్రవలెంగాక, శంకరుండు తన బుద్ధిబలము చిన్నతనమునుండియే కనంబఱుపసాగెను. ఏండాది వెళ్లుటకుముందే, యక్షరములనన్నింటి గ్రహించెను. రెండవ సంవత్సరమున వానిని వ్రాయంజొచ్చెను. మూండవయేంట సకల కావ్యేతిహాస పురాణపారగుం డయ్యెను. ఈయనకు విద్యాగురు వెవ్వరైనదియుం దెలియరాదు. ఎవ్వండైనను, ఈయన గురువునకు మహోపకర్తగా నుండెను. విన్నమాత్రముననే విద్యను గ్రహించి, గురువునకుమాఱు తక్కిన శిష్యులకెల్లందానే పాఠములు చెప్పుచుండెను. ఏడవసంవత్సరమున నీయన కుపనయనముచేయం దండ్రి సంకల్పించెనుగాని, యది నెఱవేఱక మున్న ఆయనచనిపోవుటచేత, శంకరునితల్లి ఈకార్యము నితరులచే నెఱవేర్పించెను. ఇట్లు బ్రహ్మచర్యాశ్రమమును స్వీకరించి శంకరుండు గురుకులవాసము చేయంబోయెను.

## బ్రహ్మచర్యము

బ్రహ్మచర్య మాచరించుబాలకుండు సద్బ్రాహ్మణుల యిండ్లలో బిచ్చమెత్తి తాం దెచ్చినయన్నములో ముఖ్యాంశము గురువునకు నివేదించి మిగిలియున్నదానిని గుర్వనుజ్ఞంబొంది తానుదినవలయును. శంకరుండీరీతిం జేయుచు గురువునొద్ద వేద వేదాంగములు గ్రహించుచున్న కాలములో నొకనాండు ఒక పుణ్యాంగన వటువునకు మాధుకరమైనం బెట్టంజాలని తనదారిద్ర్యమునకుం జింతిల్లుచుం దనయింటనున్న యొక్కయుసిరిక

కాయ శంకరునకు భక్తిపూర్వకముగా సమర్పించుకొనెను. శంకరుఁడు కరుణాళువుగావునఁ దనయోగబలమున లక్ష్మీ దేవిని సాక్షాత్కరింపఁజేసికొని, యామెచే నాపుణ్యసాధ్వి యిల్లంతయు స్వర్ణమయములైన యుసిరికకాయలచేత నిండించి యామె పేదఱికముపోఁగొట్టెను. ఇట్లు ఏడవసంవత్సరముననే విద్యాభ్యాసమంతయుఁ బూర్తిగావించుకొని శంకరుఁడు స్వగృహమునకు వచ్చినవాఁడై తల్లికి శుశ్రూషచేయుచుఁ గాలము గడపుచుండెను.

ఒక్కనాఁడు శంకరునితల్లి పూర్ణానదికి స్నానమునకుఁ బోయి ఎంతకాలమునకును ఇంటికిరాకుండెను. శంకరుఁడు పోయిచూడఁగా, ఆమె యెండవడగొట్టి నదీతీరమునఁ బడియుండె. ఆమెను దిన్నఁగా నింటికిఁ దీసికొనివచ్చి, శైత్యోపచారములుచేసి సేదదీర్చి, శంకరుఁడు ఇఁకముందు ఇట్టికష్టము తనతల్లికి సంభవిల్లకుండుటకై, పూర్ణానదిని బ్రార్థించెను. శంకరుని కోరికప్రకారముగాఁ బూర్ణానదియుఁ బూర్వమార్గమునువదలి ఆయన యింటిముంగలఁ బ్రవహింపసాగెను. ఆ యద్భుతమునుజూచి కాలట్యగ్రహారవాసులు విస్మితులైరి. కేరళదేశప్రభువు రాజశేఖరుఁ డీయుదంతము విన్నవాఁడై, రత్నములు – ఆభరణములు – ఏనుఁగులు మొదలగువానిని గానుకగాఁ దీసికొని శంకరుని సందర్శింపవచ్చెను. శంకరుఁడు ఈ వస్త్రభూషణాదులఁ గొననొల్లక, ప్రభు రచితములైన మూఁడుగ్రంథములు మాత్రము తనయొద్ద నుంచికొని వానిని జదివి మరలఁ బ్రభువునకుఁ బంపివేసెను.

## ఋషి సందర్శనము

శంకరుని యసాధారణమైన మేధావిశేషమును అప్రాకృతమహిమయు దేశమంతట వ్యాపించి, పెక్కండ్రు తమ కూఁతుల నాయనకిచ్చి పెండ్లి సేయ శంకరునితల్లికి వార్తలు పంపసాగిరి. శంకరునితల్లియు అసమానలక్షణలక్షితుఁడైన తనకుమారుఁడు గృహస్థుఁడై బిడ్డలఁ గనుఁగొని వృద్ధదశ యందుఁ దనకు అండగానుండునని కరమువ్విళ్లూరుచుండెను. ఇట్లుండ నొక్కనాఁడు శంకరునిజూడ నగస్త్యపురస్సరులై ఉపమన్యువు మొదలగు ఋషీశ్వరులు ఆయన యింటికి వచ్చిరి. పురాణములలో వినుటయే కాని, ఇట్టివారి నెన్నఁడును చూడని హేతువున శంకరుని తల్లి ఆశ్చర్య సముద్రనిమగ్నురాలయ్యెను.

శంకరుఁడు వారలకు యుక్తరీతి నాతిథ్యమొసఁగి వారు సుఖోపవిష్టులైయున్న సమయమున వారితోఁ బరమార్థవిషయములు మాటలాడఁజొచ్చెను. శంకరుని తల్లియు నివ్వెఱపాటుననుండి తెప్పిఱిల్లి యామహాత్ములం జూచి “మునీంద్రులారా! మీరాకచే మాయిల్లు పావనమైనది. దేవతలకుఁ గూడఁ జూడ దుర్లభులైన మిమ్ము వీక్షించుటచే నాజన్మము సఫలమయినది. ఇదియంతయు నాకుమారుని భాగ్యోదయముగాఁ దలంచుచున్నాను. ఇట్టి యౌన్నత్య మొందుటకు నాకుమారుఁడు తొల్లిజన్మములందు ఎట్టిసుకృతము లాచరించెనో నాకు సెలవిచ్చి నన్నుఁ గృతార్థురాలిని గావింపుఁ” డని వేఁడుకొనెను. ఇందుల కగస్త్యుఁడు “తల్లీ! నీవు మిక్కిలి

భాగ్యశాలినివి. ఈ నీపుత్త్రుఁడు సాక్షాత్కైలాస వాసియైన శంకరుఁడు. శ్రీ కృష్ణుని గాంచిన దేవకీదేవివలెను, శ్రీరాములనుగన్న కౌసల్యవలెను నీవు పూజ్యురాలవు. ఐన, నింకొక్క రహస్యముకలదు. పూర్ణాయుష్కుఁడును సామాన్య గుణవంతుఁడునైన కొడుకునిత్తునని పరమేశ్వరుఁడు చెప్పఁగా, వానినొల్లక నీ విభుఁడు అల్పాయుష్కుఁడైనను సర్వజ్ఞుఁడైన కుమారుఁడే కావలయునని వేఁడుకొనెను. సర్వజ్ఞుఁడు వేఱొక్కఁడు లేమింజేసి తానే నీగర్భవాసమున కియ్యకొని శంకరుఁడే శంకరుఁడై నీకుఁ బుత్త్రుఁడుగా జనించెను. వీరి యాయుస్సు 16 సంవత్సరములు గాని కొన్నికారణములవలన నీయన 32 సంవత్సరములు బ్రతుకఁగలఁడు" అని చెప్పెను. ఆమాటవిని పెనుగాలివలన నేలకొఱగు లతకూనవలె శంకరుని తల్లి మూర్ఛిల్లి నేలమీఁదఁబడెను. ఋషులు శంకరునకుఁ గానున్న కార్యములు దెలిపి యథేష్టము వెళ్లిపోయిరి.

శంకరునితల్లి ఈవార్త విన్ననాఁటనుండి చింతాక్రాంతయై శంకరుని వివాహము చేసికొమ్మని మఱింత తొందరింపఁదొడఁగెను. పెండ్లియైనయెడల భార్యయొక్క మంగళసూత్రబలము వలననైన నీయన దీర్ఘాయుష్కుఁడగునని ఆయమ తలఁచెఁగాఁబోలు! శంకరుఁడు దీనికంగీకరింపక తాను సన్న్యసింపఁ దలంచియున్న సంగతిని నివేదించి యవకాశ మేర్పడి నపుడెల్లఁ దల్లికి వైరాగ్యోపదేశము చేయసాగెను. కాని, యెన్నియుపాయములచేతను సన్న్యాస గ్రహణమునకు ఆమెయనుజ్ఞఁ బడయఁజాలఁడయ్యె. ఇట్లు కొన్నిదినములు జరు

కాఁగా నొక్కనాఁడు నదీస్నానమునకేఁగి శంకరుఁడు మొసలి చేతఁ బట్టుకొనఁబడి తల్లినిగూర్చి బిట్టువాపోవసాగెను. తల్లియు నదీతీరమునకేఁగి మృత్యుముఖము చొచ్చియున్న కుమారునిగూర్చి విలపింపఁ జొచ్చెను.

అప్పుడు శంకరుఁడు తల్లికిఁదనకున్న సన్న్యాసగ్రహణ వాంఛనుమరలఁదెల్పి ఆమెయాజ్ఞయైన నప్పుడైన ఆపత్సన్న్యాసము గ్రహించి నిండుమనస్సుతోఁ బ్రాణములు విడుతునని చెప్పెను. తల్లి యీమాటకు మాఱు చెప్పనేరక శంకరుని సన్న్యాసమున కభ్యనుజ్ఞ నొసంగెను. శంకరుఁ డేక్షణమున సన్న్యసించెనో ఆక్షణముననే మొసలి యాయన కాలువిడిచి నీళ్లలోనికిఁబోయెను. రాహుగ్రహణ నిర్ముక్తుఁడైన పూర్ణ చంద్రునివలె శంకరుఁడు ఏయపాయమును లేక నీళ్లనుండి నదీ తీరమునకువచ్చి చూపఱకు ఆనందమును ఆశ్చర్యమును గలిగించెను. ఇట్లు సన్న్యస్తుఁడైన కుమారునితోఁ దనకింక సంబంధము పొసఁగదని తెలిసికొని, ఎక్కడనున్నను అవసాన కాలమునకు మాత్రము తనయొద్దకువచ్చి తనకు దహనసంస్కారములు జరిగింపవలయునని వాగ్దానము చేయించుకొని, శంకరునితల్లి శంకరుఁడు దేశాంతరమునకు వెడలిపోవుటకు ఎట్టకేలకు అనుజ్ఞ యిచ్చెను. మాతృవత్సలుఁడైన శంకరుఁడును తల్లిని జ్ఞాతులయొద్ద విడిచిపెట్టి పితృగేహమును వదలి నిస్సంగుఁడై గుర్వన్వేషణము చేయుచు దేశసంచారము చేయ నారంభించెను.

# తృతీయాధ్యాయము.

దేశమం దందందు, ఇప్పుడు సర్వ కలాశాలలు (Colleges) ఎట్లున్నవో, అట్లే పూర్వకాలమున బ్రహ్మవిద్యను యోగ్యులగు శిష్యులకు బోధించు నాశ్రమము లుండెనని యూహింపఁదగియున్నది. సర్వకలాశాలలు జనసమ్మర్దము కలిగిన ముఖ్యపట్టణములందు స్థాపింపఁబడినట్లే, ఆ బ్రహ్మ విద్యాస్థానములు మనుష్యసంచార శూన్యములై ప్రశాంతము లైన యాశ్రమములయందు వర్ధిల్లుచుండెను. కలాశాలలలోఁ బ్రపంచభోగ సాధన హేతువులైన రసాయనాది శాస్త్రములు బోధింపఁబడునట్లే, ఆయాశ్రమములయందు నిష్ప్రపంచ బ్రహ్మాత్మ బోధ హేతువులైన మహావాక్యములు ఉపదేశింపఁ బడుచుండెను. ఈయాశ్రమములకు వచ్చువిద్యార్థులు జీతములు కట్టనక్కఱలేదు. వయోనియతిలేదు. అదియున్న ఎనిమిది సంవత్సరముల యీడేనిలేని శంకరునకుఁ బ్రవేశము దొరకునా? ఇన్ని సౌకర్యములున్నను ఇక్కడికి విద్యార్థులు నూటికిఁ గోటికి నొక్కరుఁడుగాక యెక్కువవచ్చుటలేదు. వచ్చినవారిలోను గృహీతులగువారు కరమరిది. ఏలయన, ఇక్కడి ప్రవేశపరీక్ష దుస్తరమైనది. చిత్రలేఖనమో, గణిత శాస్త్రమో, చరిత్రాంశములో, విషయము లిత్యాదికము లైనఁ గొందఱుగాకున్నఁ గొందఱైనఁ గృతార్థులు కావచ్చును. కాని, ఇక్కడి పరీక్ష విద్యార్థుల బుద్ధిగరిమను మాత్రమ విమ

ర్శించునది కాదు. చిత్తశుద్ధిని విమర్శించునది. సత్యము - జితేంద్రియత్వము - ముముక్షుత్వము - ఇత్యాదులు విషయములు. రావలసిన 'మార్కులు' నూటికినూఱు. ఇఁక శ్రద్ధా భక్తులలోనన్ననో, విద్యార్థి తత్స్వరూపుఁడుగా నుండవలయును. ఇవి యీకాలమున మందునకైనఁ గానరావుగదా ?

శంకరుఁడు గోవింద యోగీంద్రునియొద్ద
బ్రహ్మవిద్య గ్రహించుట

ఇట్టి యాశ్రమమొక్కటి నర్మదా నదీతీరమున నుండుటదెలిసికొని, శంకరుఁ డచ్చటకి వచ్చిచేరెను. గోవింద యోగీంద్రుఁడతని వృత్తాంతమంతయు విచారించి యోగ్యుఁడైన శిష్యుఁడు తనకులభించెనని యుప్పొంగి యతనికి బ్రహ్మవిద్యా సంప్రదాయ రహస్యముల నన్నింటి నుపదేశించెను. ఈ గోవింద యోగీంద్రుఁడు గౌడపాదుని శిష్యుఁడు. మాండూక్యోపనిషత్తుకుఁ గారిక వ్రాసిన మహనీయుఁ డీగౌడపాదుఁడే. ఇతఁడు శుకదేవుని శిష్యుఁడని చెప్పుదురు. ఇట్టి గురుపరంపర వలనవచ్చిన విజ్ఞాన మెట్టిదిగానుండవలెను!! శంకరుఁ డీ యాశ్రమమునఁ గొన్ని సంవత్సరములు గడపెను. ఒక్కనాఁడు గోవిందయోగీంద్రుఁడు ధ్యాననిష్ఠయందు శరీరము మఱచియుండఁగా, అప్పుడు వర్షాకాలము కావునఁ బెనుజల్లుల వలన నర్మదానది యుప్పొంగి ఆశ్రమమును గొట్టికొని పోవ నారంభించెను. గురునకు విపత్తు ఘటిల్లకుండుటకై నర్మదా నదీ ప్రవాహమునెల్ల శంకరుఁడు తన కమండలువులోనికి క్షణమాత్రమున నాకర్షించుకొనెను. ఈవార్త గోవిందయతి తెలిసి

కొని శిష్యుని యోగసంసిద్ధికి సంతసిల్లి - కొన్ని నిమిత్తముల వలన వ్యాసుల బ్రహ్మసూత్రములకు భాష్యము వ్రాయవలసిన ఘనుఁడీతండ యని యెఱిఁగి మఱి తెలిపి శంకరునకు యతిధర్మముల నుపదేశించి కాశీపట్టణమునకుఁ బోవనాజ్ఞయొసంగెను. ఈ గోవిందయతి మహాభాష్యకర్తయగు పతంజలియొక్క యపరావతారమని శంకరుఁడు చేసిన యీ స్తోత్రమువలన విశదమగుచున్నది.

శ్లో॥ పర్యంకతాంభజతి యఃపతగేంద్రకేతోః
పాదాంగదత్వ మథవా పరమేశ్వరస్య ।
తస్త్యైవ మూర్ధ్నిధృతసాబ్ధిమహీధ్రభూమే
శ్శేషస్య విగ్రహ మశేష మహంభజేత్వాం ॥

శ్లో॥ దృష్ట్వాపురానిజసహస్రముఖీ మభైషు
రంతేవసంత ఇతితామపహాయ శాంతః ।
ఏకాననేన భువి యస్త్వవతీర్య శిష్యాన్
అన్వగ్రహీన్ననుసఏవ పతంజలిస్త్వం ॥

శ్లో॥ ఉరగపతిముఖా దధీత్యసాక్షాత్
స్వయ మవనేర్వివరం ప్రవిశ్యయేన ।
ప్రకటిత మచలాతలేనయోగం
జగదుపకారపరేణ శబ్దభాష్యం ॥

శ్లో॥ త మఖిలగుణపూర్ణం వ్యాస పుత్రస్య శిష్యాత్
అధిగతపరమార్థం గౌడపాదాన్మహర్షేః ।
అధిజిగమిషురేష బ్రహ్మసంస్థా మహంత్వాం
ప్రసృమరమహిమానం ప్రాప మేకాంతభక్త్యా ॥

గోవిందయతి యంతర్ముఖుఁడై కాలమెల్ల సమాధి యందు గడపుచుండినట్లు భావింపఁ దగియున్నది. కాకున్న, నీయన తరువివరమున నుండఁబనియేమి? కాక, యే దేని తప్పిదమొనర్చి యది తప్పించుకొనుటకే 'పన్నాగము' పన్నెనా? ఆధునికులలోఁ బెక్కండ్రు సమాధి స్వరూపము నెఱుఁగక, మఱిదాని నెఱుంగఁ బ్రయత్నింపక, ప్రపంచ వ్యాపారములయందుఁ జవిమాని యంతర్ముఖులై యుండు పెద్దలను, మొద్దులనుగాను, మోసగాండ్రనుగాను భావించుచున్నారు. ఇదెట్టివెఱ్ఱి! విషయాదులు తమకిష్టమైన నందఱకు నట్లే కావలయునా? లాభాలాభములు మానావమానములు- ఈ ద్వంద్వములయందుఁబడి దరిగానక యల్లాడుచుండుటకన్నఁ బరమార్థము లేదా? ఇది పరమార్థమగునా? దీనిలోని వైరస్యమును బహుజన్మముల యనుభవమువలన నెఱిఁగి విరక్తులై యున్నవారికిం దాసక్తిజనించు టెట్లు? ఇట్టివారివలనఁ బ్రపంచమునకేమి ప్రయోజనమని కొందఱందురేమో! కాని యట్టి సంశయశీలుడు బుద్ధాదుల చరిత్రములు చదివికొని బుద్ధిమంతులు కావచ్చును. సమ్యగ్దర్శనము కొఱకు బుద్ధుఁడు రాజ్యమును సంసారమును గూడఁ ద్యజించెను. తుదకుఁ దన విజ్ఞానమును అతితీవ్రమైన ధ్యాననిష్ఠయందుఁ బడసెను! బుద్ధుఁడు లోకమునకుఁ బ్రయోజనకరుఁడో కాఁడో నేను జెప్పనవసరములేదు. మతకర్తలై నుతికెక్కిన వారిలో నుపరతిలేని వారులేరు. ప్రపంచ ముపశమింపక పరమార్థము స్ఫురించు టెట్లు? ఈగోవింద యోగీంద్రుని చరిత్రము శ్రీరామకృష్ణ

పరమహంస చరిత్రమును దలంపునకుఁ దెచ్చుచున్నది. రామ కృష్ణపరమహంస విరక్తుఁడు. వ్యాపారవిముఖుఁడు. కృశీభూత మైన యీయన శరీరమును, ఈయన మలినవసనములును, జూచినవారు ఈయనను జడునిగాను, ఉన్మత్తునిగాను దలంచు చుండిరి. కాని, ఈ మహామహునిదివ్యాశయములు కావే వివేకానందస్వామి ముఖమున వినిస్ఫురితములై పాశ్చాత్య దేశములలోని విపశ్చిత్తులకెల్ల శిరశ్శ్లాఘ్యములైనవి? ప్రాచీను లలో ఉపదేశార్థ్యముయొక్క పరమావధి మౌనము. ఆచా ర్యుని మౌననిష్ఠ అంతేవాసికి సర్వసంశయ విచ్ఛేదకము. ఇఁక వాగ్రూపములైన బోధనలు రెండవ తరగతిలోనివి. ఈ యుప దేశతత్త్వము సాకల్యముగా నరయఁగోరువారు శ్రీవివేకా నందస్వామి విరచితమైన భక్తియోగము చదివి గొంతవిష యము గ్రహింపవచ్చును.

# చతుర్థాధ్యాయము.

## శంకరుని కాశీనివాసము

శంకరుఁడు కాశీపట్టణము చేరిన యల్పకాలము లోపలనే ఆయనకీర్తి దేశముల నెల్ల వ్యాపించి పెక్కు డలనుండి శిష్యులు రాసాగిరి. కావేరీతీరమందుండి వచ్చిన చోళదేశపు బ్రాహ్మణకుమారుఁ డొక్కఁడు ఆయనకు మొదటి శిష్యుఁ డయ్యెను. ఈతనిపేరు విష్ణుశర్మ. కాని, యీతఁడు ఒక్కపరి గుర్వాజ్ఞానుసారముగా గంగానది ఆవలిదరినుండి యీవలి దరికి నీళ్ళమీఁదనడచి వచ్చినందున, శంకరుఁడీతనికిఁ బద్మపాదుఁడను పేరిడియెను. ఇట్టియద్భుతశక్తి యితనికి అసమానమైన గురుభక్తివలనఁ గలిగినదని యితరశిష్యులకు బోధపఱుచుటకై శంకరుఁ డీతనిచేత నీకార్యము చేయించెను. పద్మపాదుఁడుగాక శంకరునకు ఆనందగిరి, చిత్సుఖుఁడు, మొదలగు శిష్యులింకఁ గొందఱుండిరి. వారెల్ల శంకరునివలన సన్న్యాసము గ్రహించినవారే.

## గ్రంథరచన.

శంకరుఁడు వ్రాసిన యనేక గ్రంథములలో నేదిముందు వ్రాసినది ఏది వెనుక వ్రాసినది నిర్ణయించుటకుఁ దగిన యాధారములు లేవు. చిన్నచిన్న పొత్తముల మున్ముందు రచించి పిదప మహాగ్రంథముల ఈయన రచించెనని చెప్పుట సమంజసముగానున్నది. అదిగాక నిర్విరామముగా నీయన

గ్రంథరచనలయందును శిష్యబోధనల యందును గాలము గడపెనని వచింపఁ దగియున్నది. సందర్భానుసారముగా స్తోత్రములు—శతకములు మొదలగునవికూడ శంకరుఁడప్పటప్పటికి రచించుచుండెను. ఇట్టి రచనలయందు ఒండు రెండు ఇందుదాహరించుచున్నాను.

మనీషాపంచకము.

ఒకనాఁడు శంకరుఁడు శిష్యసహితుఁడై గంగాస్నానమునకుఁబోయి తిరిగివచ్చుచుండఁగాఁ ద్రోవలో నొక్క చండాలుఁ డెదురుపడియె. అతని యసహ్యమైన శరీరమును వెంటనంటి వచ్చుచున్న కుక్కలనువీక్షించి శంకరుఁడు వానిని దూరముగాఁ దొలంగి పొమ్మనియెను. ఆమాలవాఁడందుల కెదురొ్కని శంకరునితో "నీవుచేయు బోధమునకును నీ ప్రవర్తనమునకును సంబంధము లేక యున్నది. సర్వ సమభావమును నీవు శిష్యులకుఁ జెప్పుచున్నావు. నీవుచేయుపని మాత్రము భేదదృష్టిని బలపఱుచుచున్నది. నన్ను నీవు తొలఁగి పొమ్మని యంటివిగదా? ఇది నీవు నాశరీరమును గూర్చి చెప్పుచున్నావా? లేక నా యాత్మను గూర్చియా? రెంటనునీమాట యజ్ఞాన జన్యముగా నున్నది. శరీరమును గూర్చి యనియంటివా నాశరీర మెట్లు రక్తాదిధాతువులతోఁ గూడుకొని మలినముగానున్నదో అట్లేనీశరీరము నున్నది. ఇందు దూరముగా నేను బోవలసిన కారణములేదు. ఇఁక నాయాత్మను గూర్చి నీవట్లు చెప్పియున్న పక్షమున నీయట్టి యజ్ఞాని వేఱొక్కఁడుండఁడు. ఆత్మతొలంగి పోవుటెట్లు?

"శునిచైవ - శ్వపాకేచ - పండితాస్సమదర్శినః" అని వేదాంతములు అభేదమును ఘోషించి చెప్పుచుండఁగా నన్నుఁ దొలంగుమనుట యెట్టివివేకము? మోసగాండ్రు కాషాయ వస్త్రములు ధరించి సన్న్యాసి వేషమున గృహస్థులను వంచింతు రని నేను వినియుంటిని. ఆమాట నేఁటికి నిక్కమైనది" యని తాను జెప్పుదానికి అనుకూలముగా ననేక శ్రుతిస్మృతులనుండి వాక్యములు చెప్పనారంభించెను. శంకరుఁడు నిర్విణ్ణుఁడై చండాలున కిట్టి జ్ఞానముండుట కాశ్చర్యపడి ఇందుకుఁగారణము నాలోచింపసాగెను. ఇంతలోఁ జండాలుఁ డదృశ్యుఁడై యాచోటఁ జంద్రార్ధధరుఁడు కాశీపురీశ్వరుఁడు సాక్షాద్విశ్వ నాథుఁడే శంకరుని యెదుటనుండెను. శంకరుఁడు సంతోషా ద్భుతములు పెనఁగొన విశ్వనాథునకు నమస్కరించి భాష్య రచనకు ఆయనచే మరల ననుజ్ఞ గొనియె. ఈసమాగమమును గూర్చి శంకరుఁడు 'మనీషాపంచక' మనుపేర నైదు శ్లోకములు రచించెను. అవి యిప్పటికిని దేశమందు వ్యాప్తిలోనున్నవి. శంకరుఁడు పరమార్థమున నభేదమును బోధించినను, ఆభావ మును అందికొనఁజాలని సామాన్యజనుల మేలుకొఱకు వ్యవ హార భేదము నంగీకరించి, యెక్కడివా రక్కడనుండి పై మెట్టునకువచ్చుటకు అనుకూలముగా త్రైగుణ్య విషయములు గూడ వారికిఁ గఱపు చుండెను. ఈయన యొక్కనాఁటి మధ్యాహ్నము కాశీ పట్టణము వీథిలోఁ బోవుచుండి, తీవ్ర పిపాసార్తితుఁడై తాటిచెట్టునుండి కల్లు గీచుచున్న యొక్క యీడిగవానివలన సురను బుడిసిటఁగైకొని ధారాళముగాఁ

ద్రాగివేసెను. ఇయ్యధర్మవర్తనకు శిష్యులాశ్చర్యపడియు, శంకరునిఁ గారణ మడుగనేరక యూరకుండిరి. కాని, యందు సురారసలాలసుఁడైన యొక్కఁడు మాత్రము గురువుయొక్క యాచరణము తనకభ్యనుజ్ఞగాఁగొని తానుగూడఁ గొంత సురను సేవించెను. శంకరుఁడిదిచూచియుఁ జూడనివాఁడు వోలె నూరకుండి, యింకఁగొన్ని యడుగులు నడచిన వెనుక, సమీపమున నొక్క యినుప పనివాని యంగడిలో మూసలో కళ కళ గ్రాఁగుచున్న యినుపనీటిని బుడిసిటఁ గైకొని యే చింతయులేక క్షణములోఁ ద్రాగివేసెను. శిష్యులాశ్చర్య నిర్మగ్నులైరి. సురనుద్రాగిన శిష్యుఁడు వెలవెలపోయెను. శంకరుఁ డీశిష్యునకు బుద్ధిచెప్పి స్వధర్మోల్లంఘనము ప్రకారణము చేతను గావింపఁ గూడదని శిష్యులకెల్ల బోధించెను. ఒక్క యధికారమునున్న వాని ధర్మము వేఱొక్క యధికారమున నున్నవానికి ధర్మము కాదనుట కిది ప్రబల నిదర్శనముగా నున్నది.

విశ్వనాథ సాక్షాత్కార సమయమున శంకరుఁడు చేసిన స్తోత్రమున నీయర్థము గూఢముగా నడఁగియున్నది.

శ్లో॥ దాసస్తేహం దేహదృష్ట్యాస్మిశంభో।
జాతస్తేంశో జీవదృష్ట్యా త్రిదృష్టే।
సర్వస్యాత్మ న్నాత్మ దృష్ట్యాత్వమేవే।
త్యేవంమేధీ ర్నిశ్చితా సర్వశాస్త్రైః॥

ఎంతదనుకఁ బురుషుఁడు దాను 'శరీర' మని భ్రమపడుచున్నాఁడో, యంతదనుకఁ బరమేశ్వరునియెడల నతనికి

స్వామి భృత్య న్యాయము ఉపపన్నమగుచున్నది. తాను శరీరవిలక్షణుఁడైన జీవుఁడని యెప్పుడు తెలిసికొనునో, అప్పుడు పరమేశ్వరుని యొక్కయంశములలోఁ దానొక్క యంశమను భావము అతనికి ఉప్పతిల్లుచున్నది. ఈశరీర జీవ భావముల వదలి తాను ఆత్మమాత్రుఁడని ఎప్పుడు గనుఁగొనుచున్నాఁడో, తత్క్షణము అతనికిఁ బరమేశ్వరునితో నైక్యము సిద్ధమగుచున్నది.' యని యీశ్లోకమునకుఁ దాత్పర్యము. శరీరభావముగలవాని ధర్మము జీవభావము కలవానికి ధర్మము కానేరదు. జీవభావముగలవాని ధర్మము శరీరభావము కలవానికి ధర్మము కానేరదు. ఇఁక ఆత్మభావమందు, ధర్మాధర్మరూపములైన ద్వంద్వములేలేవు. ఇట్టి జ్ఞానవంతుల ప్రవృత్తి లోకము కొఱకుఁగాని తమ కొఱకుఁగాదు.

జ్ఞానామృతేనతృప్తస్య - కృతకృత్యస్యయోగినః
నైవాస్తి కించిత్కర్తవ్యం - అస్తిచేన్నసతత్త్వవిత్ ॥

అని గీతా శాస్త్రము బోధించుచున్నది. జ్ఞానామృతపాన పరవశుఁడైనవాఁడు కృతకృత్యుఁడు. వానికిఁ జేయవలసిన కార్య మెద్దియును లేదు. కార్య శేషమున్నయెడల, నతఁడు బ్రహ్మవేత్త కాఁడు' అని యీశ్లోకమున కర్థము. ఇట్టి జ్ఞానుల ప్రవర్తనలయందొకొక్కయెడ శాస్త్రోల్లంఘనము దృశ్యమానమగుచున్నది. కాని యది సామాన్యులకు ఎన్నఁటికిని అనువర్తనీయము కానేరదు. శిష్యుఁడు తప్తాయస్సలిలమును ద్రావియున్న బ్రదికి యుండునా ? మహానుభావుల కున్న తేజోవిశేషములులేక వారి యుత్పథ ప్రవర్తనల మాత్ర

మనుకరించు సామాన్యజనులు ఉభయలోక పరిభ్రష్టులగు చున్నారు.

ద్వాదశమంజరికా స్తోత్రము.

ఒకనాఁడు శంకరుఁడు శిష్యసహితుఁడై కాశీ పట్టణము వీథిలో వచ్చుచుండఁగా, 'డుకృఞ్ - కరణే' అను సూత్రమును బఠించుచున్న యొక్క పాఠకుని కంఠస్వరము వినఁబడెను. ఇంకఁగొంతదూర మరుగఁ బాఠకుఁడే దృగ్గోచరుఁడయ్యెను. అర్వది సంవత్సరములకుఁబైబడినవాఁడు, వెండ్రుకలెల్ల నరసినవాఁడు హీనస్వరముతో, విద్యచేత నింకను ధన మార్జింపవలయు నను దురాశతో సంస్కృత వ్యాకరణమును జదువు కొనుచుండెనఁట! శంకరుఁ డతనియందుఁ గృపాళుఁడై యాతనికి వైరాగ్య ముదయించు కొఱకుఁ దత్క్షణము పండ్రెండు శ్లోకములు రచించెను. ఇవియే యిప్పుడు "భజగోవింద శ్లోకము" లను పేరుతో హిందూస్థానమందెల్ల వెలసి ఆపన్నులైన భక్త జనులకు నమృత ప్రవాహము వలెఁ జిత్తోప శాంతికరములై వర్ధిల్లుచున్నవి.

## పంచమాధ్యాయము.

శంకరుఁడు తనభాష్యములు బదరికారణ్యమందు రచించెను. ఈయరణ్యము హిమవంతముపొంత సరస్వతీనదికిఁ బశ్చిమదిక్కునను న్నది. తొల్లి నరనారాయణులు తత్త్వదర్శనము కొఱకు ఘోరమైన తపంబుసల్పినది యీయరణ్యముననే. ఇక్కడ నారాయణునివలన నారదుఁడు భక్తియోగ రహస్యములు గ్రహించినట్లు భాగవత సప్తమ స్కంధమునందలి ప్రహ్లాద రాక్షసబాల సంభాషణములోని యీక్రింది పద్యము వలన స్పష్టమగుచున్నది.

"మ॥ నరుఁడుఁ దానును మైత్రితో మెలఁగుచో
నారాయణుం డింతయుఁ
వరుసఁ నారదసంయమీశ్వరునకుఁ
వ్యాఖ్యానముఁ జేసె ముఁ
హరిభక్తాంఘ్రి పరాగ శుద్ధతను లే।
కాంతుల్ మహాకించనుల్
పరతత్త్వజ్ఞులుగాని నేరరుమదిఁ
భావింపనీజ్ఞానముఁ ॥"

కావున నీయాశ్రమము బ్రహ్మవిద్యా ప్రచారమునకుఁ గ్రొత్తదికాదు. ఇక్కడ ఆదియుగముననేగాక శంకరుని కాలమునఁ గూడఁ గొందఱు పెద్దలు తపస్సు చేసికొనుచున్నట్లును శంకరుఁడు తన భాష్యముల నప్పటప్పటికి వారికిఁ జూపుచుండి

నట్లును మాధవాచార్యులు వ్రాసియున్నారు. ఈ యాశ్రమమున శంకరుఁడు - ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకములను పేరులుగల పది యుపనిషత్తులకును, భారతములోని భగవద్గీతా, సనత్సుజాతీయములకును, బ్రహ్మసూత్రములని వ్యవహరింపఁబడు శారీరక మీమాంసా సూత్రములకును - భాష్యములు రచించెను. ఈగ్రంథములెల్ల ముఖ్యములైనవేయయినను, ఆధునికులచేత సూత్రభాష్యముమాత్రము ఎక్కువగాఁ గొనియాడఁబడు చున్నది. ఇందునకుఁ గారణము ఈ భాష్యమందు వాదప్రతివాద రూపమైన భాగములు అధికములుగానుండుటయే. శంకరుఁడు సూత్రభాష్యము వ్రాయు కాలమున ఆయనకు వ్యాసుఁడొక్కపరి దర్శనమిచ్చినట్లు ఈ క్రింది కథవలన నేర్పడుచున్నది.

ఒకనాఁటి మధ్యాహ్నము శంకరుఁడు శిష్యులకు భాష్యపాఠము చెప్పి విశ్రాంతుఁడై యుండఁగా నొక్క వృద్ధ బ్రాహ్మణుఁ డాయనయొద్దకు వచ్చి నీవు శిష్యులకుఁ జెప్పునది యే శాస్త్రమని ప్రశ్నించెను. 'వ్యాసరచితములైన బ్రహ్మసూత్రములకు నేను వ్రాసిన భాష్యమును శిష్యులకుఁ బాఠము చెప్పుచున్నా' నని శంకరుఁడు చెప్పఁగా "ఓహో! నీవు సూత్రములకు భాష్యము వ్రాసితివా? ఏదీ! చూతము. మూఁడవ యధ్యాయములోని మొదటిసూత్రమునకు 'తదంతర ప్రతిపత్తౌరంహాతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యాం' అను

దానికి నేమి భాష్యము వ్రాసితివని వృద్ధబ్రాహ్మణుఁడడిగెను. శంకరుఁడు తన భాష్యమును జదివెను. ఈసూత్రమున, దేహాంతర ప్రాప్తిసమయమున అనఁగా నొక్కదేహమును వదలి వేఱొక్క దేహమునకుఁ బోవుసమయమున జీవుఁడు పూర్వ శరీరమునుండి యేమైనఁగొనిపోవుచున్నాఁడా ? లేదా ? యను సంశయము విమర్శింపఁబడియున్నది. ఇయ్యంశమున ననేకుల కనేకాభిప్రాయములు గలవు.

ఆత్మకు దేహాంతర ప్రాప్తియయినచో, వ్యాపకము లగు నింద్రియముల కచ్చటనే వృత్తిలాభము గలుగుచున్న దని సాంఖ్యుల యభిప్రాయము. నిర్వికల్పజ్ఞాన సంతాన రూప మగు నాత్మకు దేహాంతరమున సవికల్ప జ్ఞానాఖ్యమగు వృత్తి లాభము కలుగుచున్నదనియు, దేహమువలె నింద్రియములు కూడ నచ్చటచ్చట భోగస్థానమున నూతనముగఁ బుట్టుచున్న వనియు సౌగతుల (యోగాచారుల) యాశయము. మనస్సు మాత్రమే భోగస్థానమగు దేహాంతరమును గూర్చి వెళ్లుచున్న దనియు నింద్రియములు నూతనముగ సృజింపఁబడు చున్న వనియుఁ గాణాదులవాదము. వృక్షమునుండి వృక్షాంతరమును గూర్చి శుకమెగురునట్లుగ, దేహమునుండి దేహాంతరమును గూర్చి జీవుఁడుమాత్ర మెగిరిపోవుచున్నాఁడనియు నింద్రియ ములు పోవుట లేదనియు జైనుల మతము. భస్మీభూతమగు దేహముతో నింద్రియములు కూడ సమసిపోవుననియు వానికి దేహాంతర ప్రాప్తిలేదనియు దేహాత్మ వాదముచేయు

చార్వాకులసిద్ధాంతము. ఇట్టి వివాదాస్పదమైన ఘట్టమున శంకరుని ప్రజ్ఞను బరీక్షింపనెంచి వృద్ధబ్రాహ్మణుఁడు ఆయధికరణమునకు శంకరుఁడు వ్రాసినభాష్యము నొప్పికొనక, పూర్వపక్షమును సహస్ర విధములఁ బ్రకాశింపఁ జేయ సాగెను. శంకరుఁడీతనితో నెన్మిది దినములు వాదించియు నీయనను జయింపనేరక యిట్టి యప్రాకృత మేధా ప్రభావ మీతనికెట్లు గలిగియుండునని యూహించుచుండఁగా నెట్లో వృద్ధబ్రాహ్మణుని స్వరూపము గుఱితించిన పద్మపాదుఁడు శంకరుని గూర్చి

"శ్లో॥ త్వంశంకర శ్శంకర ఏవసాక్షాత్ ।
వ్యాసస్తు నారాయణ ఏవనూనం ।
తయోర్వివాదే సతతం ప్రసక్తే ।
కిం కింకరోహం కరవాణిసద్యః॥"

అని హెచ్చరించెను.

"శంకరుఁడవైన నీవు సాక్షాచ్ఛంకరుఁడవే. ఇఁక, వృద్ధ విప్రరూపముననున్న వ్యాసుఁడన్ననో ఆయన సాక్షాన్నారాయణుఁడు. శివకేశవులరైన మీరలే యిట్లు వాదించుకొను పక్షమున, కింకరులమైన మేమేమి చేయవచ్చును?" అని యీశ్లోకమున కర్థము. ఇట్లు పద్మపాదుఁడు సూచింపఁగా యథార్థము స్ఫురించి శంకరుఁడు వినయవినమితోత్తమాంగుఁడై వృద్ధవిప్రునితో "స్వామీ! తమస్వరూపము నెఱుఁగక తమతో వాదింపఁదలకొన్న నాయపరాధమును క్షమింప

వలయును. గురుజనముపట్లఁ బ్రణిపాతమును, బరిప్రశ్నమును, సేవయును గార్యములుగాని వివాద మెన్నఁటికినిఁ గార్యము కానేరదు. అందును దమరు నాకుఁ బరమగురువులు. తమ పుత్త్రుఁడైన శుకమహర్షి వలన బ్రహ్మవిద్యగ్రహించిన గౌడ పాదున కేనుబ్రశిష్యుఁడను. లోకహితమునకు బద్ధకంకణుఁ డవై యామ్నాయముల విభజించి యందుకుఁగూడ నధి కారములేనివారల నిమిత్త మసంఖ్యములైన పురాణములు కల్పించి జగదుద్ధారము గావించుచున్న నీకడను నేనెంత వాఁడను? భాష్యకర్తృత్వాభిమానమును నిజముగా నేను వదలనేర కున్నను, మీవలననుదితమైన విజ్ఞాన ధార గదా యాగ్రంథమందుఁ బ్రవహించు చుండునది. సూత్రముల యొక్క యర్థపారము తత్కర్తవైన నీకుఁ దెలియనోపుఁగాని యస్మదాదు లదిగాంచ నెంతవారు?

చ॥ "క్రమమున మింటికై యెగయుఁగాక విహంగము మింటిదైనపా।
రముగన నేర్చునే హరిపరాక్రమ మోపినయంతగాక స।
ర్వము వివరింప నెవ్వఁడు ప్రవర్తకుఁడో, మునులార! నాదు చి।
త్తమునకు నెంత దోఁచెనది తప్పక చెప్పెద మీకు నంతయుఁన్॥"

అన్నట్లు సూత్రములకు నాకుస్ఫురించి నంతదనుక భాష్యము వ్రాసితినిగాని, అందలియభిప్రాయ సర్వస్వము గ్రహించితినని చెప్ప నేనేమిసర్వజ్ఞుఁడనా? నాభాష్యము దమకుఁ బరిగ్రాహ్యమని తోఁచినయెడల మీ స్వరూపము గనఁ బఱచి నన్నునుగ్రహింపవలయు" ననిపలుదెఱుఁగుల వేఁడు

కొనెను. శంకరుఁడిట్లు వేఁడుకొనుచున్న సమయమున వృద్ధ బ్రాహ్మణుఁడంతర్హితుఁడై ఆచోట బ్రహ్మతేజమునకు స్థానభూత మైన విశాలలలాటమును, నీలనీరదనిభమైన మహోన్నత శరీరమును, చేత దండ కమండలువులును, శిరమున బంగారు తీఁగెలవలె నందమైయున్న జటాకలాపమును, కంఠమున రుద్రాక్ష మాలయునుగల కృష్ణద్వైపాయనుఁడు శంకరుని ముందర సాక్షాత్కరించెను. శంకరుఁడు శిష్య సహితముగా వ్యాసునకు నమస్కరించెను. అప్పుడు వ్యాసుఁడు శంకరుని వలన భాష్యమును సాదరముగాఁగైకొని సావధానముగాఁ జదివిచూచి "వత్సా! నీవలన నేను మిక్కిలి సంప్రీతుఁడ నైతిని. గూఢములైన నాయాశయముల నిట్లు గ్రహించిన వారు వేఱొక్కరు లేరు. నీవుసర్వజ్ఞుఁడవు గావున నే, నీకిట్టి యస మానమైనశక్తి సమకూరినది.

నీవు నాసూత్రములకు భాష్యము వ్రాసితివని కొందఱు సిద్ధులవలనవిని, నీయుక్తిబలమును నీయాశయ వైశాల్యమును బరీక్షింపనెంచి నేనరుదెంచితిని. నీయుక్తిబల మద్వితీయము. నీయనుభావ మసదృశము. ఇఁకనీకు లోకమున దుస్సాధమేది యును లేదు. నీభాష్యము సర్వవిధముల సన్మాన్యముగా నున్నది." యని బహువిధముల శ్లాఘించి వాత్సల్యాతిశయ మున శంకరుని కౌఁగిలించుకొని కానున్న కార్యములఁ గొన్నింటిఁదెల్పి వ్యాసుఁడు యథేష్టముగా వెళ్లిపోయెను.

ఇట్లుతన ప్రస్థానత్రయము, బ్రహ్మాదులకు సమ్మత మగుటఁ దెలిసికొని, తనకుఁ బూర్వ మగస్త్యాదులు చెప్పిన

ప్రకారముగా వేదబాహ్యమతముల ఖండించి దేశమున నద్వైత ప్రతిష్ఠాపనము చేయఁగోరినవాఁడై, శంకరుఁడు శిష్యసహస్రముతోఁ గాశీపట్టణము వదలి దేశాటనము చేయ నారంభించెను.

శ్లో॥ శంకరం శంకరాచార్యం - కేశవం బాదరాయణం
సూత్రభాష్య కృతౌవందే - భగవంతౌ పునఃపునః ॥

అని సప్రశ్రయముగా నమస్కరించుచున్నాను.

# షష్ఠాధ్యాయము.

శంకరుఁడు దిగ్విజయమునకు వెడలునప్పటికిఁ గాశీపట్టణమును రత్నసింహుఁడను రాజు పాలించుచుండినట్లును, అతఁడు శంకరుని యఖండ పాండిత్యమును విని యాయనను దన యోలగమున నుంచికొనఁదలంచి నట్లును ఒకానొకరు వ్రాసియున్నారు. కాని త్రైలోక్యగురువు గావలసియున్న శంకరుఁడు తనకుఁ దనగురువులవలననైన యాజ్ఞను దెలిపి యందులకియ్యకొనఁడయ్యె. ప్రభుసమాశ్రయమందు ఇట్టి నిస్స్పృహత్వము వైరాగ్యవంతులకు వెన్నతోడఁ బెట్టినదిగానున్నది. భాగవతము ద్వితీయ స్కంధమునందుఁ బరీక్షిన్నరేంద్రునకు శుక మహర్షి సంసారముయొక్క నిస్సారభావము నుపదేశించుచు,

"సీ॥ కమనీయ భూమి భాగములు లేకున్నవే
పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే
భోజన భాజన పుంజమేల?
వల్కలాజిన కుశావళులు లేకున్నవే
కట్ట దుకూల సంఘంబులేల?
కొనకొని వసియింప గుహలు లేకున్నవే
ప్రాసాద సౌధాది పటలమేల?

తే॥ ఫలరసాదులు గురియవే పాదపములు।
స్వాదుసలిలంబు లొసఁగవే సకలనదులు।

పాసఁగభిక్షులు పెట్టరే పుణ్యసతులు ।
ధనమదాంధుల కొలువేల తాపసులకు ? ॥

అని చెప్పియున్నాఁడు. ఈయర్థమునఁ బద్యమాత్రముతోఁ దృప్తిపడక భర్తృహరి వైరాగ్య శతకమున నొక్క ప్రకరణమునే రచించియున్నాఁడు. అందొక్క శ్లోకము

"శ్లో॥ వయమిహ పరితుష్టా వల్కలైః త్వందుకూలైః
సమఇహ పరితోషో నిర్విశేషోవిశేషః
సతు భవతుదరిద్రో యస్యతృష్ణా విశాలా
మనసిచ పరితుష్టే కోర్థవాన్ కోదరిద్రః ॥"

చ॥ కలితదుకూల వస్త్రములు కట్టిననీకును, జీర్ణ వల్కలం
బులుధరియించు మాకును బ్రమోదముతుల్యము ; లేదువాసి ; యు
గ్గలముగుతృష్ణ యెవ్వనికి, గాఢదరిద్రుఁడువాఁడు ; లేమియున్
గలిమియు నేల సమ్మదవికస్వర మానసులైనవారికిన్ ॥

అనియున్నది.

ఇఁక, శంకరవిజయ గ్రంథకర్తలలో నగ్రగణ్యుఁడైన విద్యారణ్యుఁడు తనగ్రంథముయొక్క యారంభముననే

శ్లో॥ వంధ్యాసూను ఖరీవిషాణ సదృశక్షుద్రక్షితీంద్రక్షమా
శౌర్యౌదార్య దయాదివర్ణన కలాదుర్వాసనావాసితాం
మద్వాణీ మధివాసయామి యమిన స్త్రైలోక్య రంగస్థలీ
నృత్యత్కీర్తినటీ పటీరపటలీ చూర్ణై ర్వికీర్ణైః క్షితౌ ॥

అని విన్నవించికొనియున్నాఁడు. ఈశ్లోకమునకర్థము

"రాజులకు ఓర్పు, దాతృత్వము, దయ, ఇత్యాది సుగుణములుండుట యరిది. గొడ్రాలు బిడ్డకనెననుట, గాడిదెకుఁ గొమ్ము వచ్చినదనుట—యీమాటలెంత సత్యములో, క్షుద్రులైన రాజులకు సుగుణములున్నవనుమాట యంత మాత్రము సత్యము గలది. ఈగుణములను రాజులయందు వర్ణించివర్ణించి నానాలుక దుర్వాసనావాసితమైయున్నది. ఈదుర్గంధము పలాయితమగుట కొఱకు త్రైలోక్య రంగస్థలమున నాట్యమాడుచున్న శంకరాచార్యుని కీర్తియనెడు ఆటకత్తె యొక్క చందన చూర్ణమును (నేలయందు వ్యాపించిన దానిని) నేను ఆశ్రయించుచున్నాను."—అని.

శంకరునికి దేశయాత్రా కాలమందెల్ల ప్రస్థానమున కుచితమైన పరిభవ మంతయునున్నట్లు ఆనందగిరియుఁ జిద్విలాసుఁడును ఇద్దఱును వ్రాసియున్నారు. దీనినిబట్టి చూడఁగా, శంకరుని అపారమేధా విశేషమున కప్పటి రాజు లరుదంది ఆయనకుఁ గావలయు పరికరములన్నియు భక్తిపూర్వకముగా సమర్పించిరని చెప్పఁదగియున్నది. శంకరుఁడు తొల్దొల్తఁ బ్రయాగకు (Allahabad) వెళ్లెను. అక్కడఁ ద్రివేణీ సంగమస్థానమున స్నానము చేయుకాలమునఁ దనమాతాపితలను స్మరించెను. ఇక్కడ గంగా తీరముననున్న చల్లని తమాల వృక్షముల నీడలో శంకరుఁడు శిష్యులతోడఁ గూర్చుండి యుండఁగా, ఉత్తర హిందూస్థానమున బౌద్ధమత నిర్మూలనము గావించిన వాఁడును పూర్వ మీమాంసా శాస్త్రాభిమానియునగు భట్టపాదుఁడు తుషానలమునకుఁ దన శరీరము నాహుతి కావింపఁ

బోవుచున్నాఁడను వార్త చెవినిబడి, శంకరుఁడు మిక్కిలి త్వరతో ఆయనను జూడ బయలు వెడలెను.

భట్టపాదుని వృత్తాంతము.

భట్టపాదుఁడు ఆసామ్ (Assam) దేశపు బ్రాహ్మణుఁడని కొందఱును, ద్రవిడదేశపు బ్రాహ్మణుఁడని కొందఱును జెప్పుచున్నారు. ఎవ్వఁడైనను, ఇతఁడు బాల్యమున విద్యలెల్ల గ్రహించి, బుద్ధివికసించు కొలఁది బౌద్ధమతమునం దభిమానము కలవాఁడై బౌద్ధమత గురువులయొద్ద ఆమత సంప్రదాయముల నన్నింటి తెలిసికొనెను. ఇట్లు కొంతకాలము జరుగఁగా, నొక్కనాఁడు ఈయన గురువు బౌద్ధమతమును శిష్యులకు బోధించుకాలమున వేదము లప్రమాణము లనియు, అవి ఈశ్వర నిర్మితములనుట యసత్యమనియుఁ జెప్పి ఎప్పటికన్న నధికముగా వేదముల నిందింప నారంభించెను. ఇందులకు భట్టపాదుఁడు కన్నీళ్లు పెట్టుకొనెను. ఇదిచూచిన శిష్యులు, భట్టపాదుఁడు బాహ్యమునకు బౌద్ధమతము అవలంబించి బౌద్ధసిద్ధాంతము నేర్చికొనుచున్నను, అంతరమున హిందూమతమందు అభిమానము గలవాఁడని తెలిసికొని బౌద్ధసిద్ధాంతములలో ఇంతటి పాండిత్యముగల భట్టపాదుని నూరక విడిచిపెట్టినఁ దమలోపములనెల్లఁ జక్కఁగా నెఱిఁగినవాఁడు గావునఁ దమమతమును ఖండించుటకుఁ దగిన ప్రయత్నము నాతఁడు చేయునని భయపడి, యొకరాత్రి తాము పరుండు మేడనుండి భట్టపాదుని మెల్లఁగాఁ గ్రిందికి దొరలించిరి. భట్టపాదుఁడు మేల్కొని "యదివేదాః ప్రమాణంస్యు ర్భూయాత్కా చిన్న

మేతుతిః" అనగా వేదములు ప్రమాణములైనచో ఈ పాటు నకుఁ దప్పి నేను బ్రతుకుదునుగాక" యని పెద్దపెట్టున నార్వఁ జొచ్చెను. "వేదములు ప్రమాణములైనచో" నని శ్రుతి యందు సంశయము సూచించినందున కొక్క కన్నుమాత్రము పోఁగొట్టుకొని భట్టపాదుఁడు ఇతర విధముల నేయపాయమును పొందక క్రిందఁబడెను. నాఁడుమొదలు అతఁడు బౌద్ధులకుఁ బ్రబల విరోధియై యేవిధముచేతనైన వారిమతమును నిర్మూలముచేయుటకుఁ దగిన యవసరము నిరీక్షించుచుండెను. భట్టపాదుఁడు ఒకపరి సుధన్వుఁడను రాజుయొక్క సభకు వచ్చెను. ఇతఁడు బౌద్ధమతావలంబి. ఆకాలమున హిందూదేశమును బాలించుచున్న రాజులలోఁ బ్రబలుఁడు. ఈతని సభలోనున్న బౌద్ధులకును భట్టపాదునకును ఘోరవివాదము జరిగెను. ఆవాదముల యుఱుఫులవలన నాకాశమే బ్రద్దలయ్యెనఁట! భట్టుఁడు బౌద్ధ సిద్ధాంత రహస్యములనెల్లఁ జక్కఁగాఁ నెఱిఁగినవాఁడుగావునఁ, బ్రతిపక్షులను వాదమందు సులభముగా జయించి వేదప్రామాణ్యమును స్థాపించెను. ఈతఁడు చెప్పినది "వేదములు అపౌరుషేయములు అనఁగా మనుష్య కల్పితములుకావు. కావున వాని సత్యమును విచారించుట కితర ప్రమాణము లక్కఱకురావు. తక్కిన స్మృతులు పురాణములు వేదమునుబట్టియే ప్రమాణములగుచున్నవి. వేదములందు కర్మకాండయేముఖ్యము. అందుఁజెప్పిన నిత్యనైమిత్తికకర్మల నాచరించుటవలనఁ దక్క ఇతర విధముగా మనుష్యులకు మోక్షము చేకూరదు" అని. ఈప్రకారము భట్టుఁడు వాదము

నందు బౌద్ధుల నోడించి, తనపక్షము నిర్వహించుకొన్నను, సుధన్వుఁడు తృప్తిపడక "వాదములో జయాపజయములు వాదించువాని బుద్ధిబలమునుబట్టి యేర్పడుచున్నవి. వానిని నేనమ్మఁజాలను. ఎవ్వఁడు ఇదిగో ఈపట్టణము ప్రక్కనున్న పర్వతము నుండి క్రిందికురికి యపాయము పొందకుండునో, వానివాదము న్యాయ్యమని నేనుదలంచెదను." అని భట్టునితోడను బౌద్ధులతోడను జెప్పెను. బౌద్ధులు చేయునదిలేక యొకరిమొగ మొకరు చూచుకొను చుండిరి. భట్టుఁడీప్రమాణమున కొప్పుకొని చూడవచ్చిన జనసహస్రముల కద్భుత మొదవునట్లుగాఁ బర్వత శృంగమునుండి ఏయపాయమును జెందకపూఁబొన్పు మీఁదికిఁబోలె నేలమీఁదికి దూఁకెను. ఇట్టి విపత్తునుండియు భట్టుఁడు తప్పించుకొనుటకు ఖిన్నులై బౌద్ధులు ఈమహిమ మణిమంత్రౌషధముల వలనఁ గలిగియుండవచ్చుననియు, దీనివలన నే మతముయొక్క గుణాగుణములు నిర్ణయింపరాదనియు వాదింపఁ దొడఁగిరి. సుధన్వుఁడు బౌద్ధులమాటలకుఁ గోపపడియు, ఏతోవఁ బోవుటకుఁ దెలియనివాఁడై, ఇంకొక పరీక్ష నేర్పఱిచెను. "మూసిన కలశములో నొక్క వస్తువునుబెట్టి తేవలయును. అందున్నది ఈవస్తువు అనిచెప్పఁగలవాని మతము న్యాయ్యము" ఈప్రకార మాజ్ఞాపించి, తత్క్షణము కడుమెలఁకువతో నెవ్వరి కెఱుఁగరాకుండ పామునుంచిన యొక్క కుండను సభలోనికిఁ దెప్పించెను.

శ్లో॥ తతస్తేసౌగతాస్సర్వే।
భుజంగోస్తీత్యవాదిషుః ।

భోగీశభోగశయనో।
భగవానితి భూసురాః॥

బౌద్ధు లందుఁ బాముున్నదనిరి. భట్టుఁడు శేషశాయి యయిన విష్ణుమూర్తియున్నాఁడనియె. సుధన్వుఁడు భట్టుని మాట బూటకమయ్యెనని వెలవెల పోవుచుండఁగా, నాకాశమునుండి "కుండలోనున్నది విష్ణుమూర్తియే" యనునొక్క ధ్వనివినఁబడియె. సభ్యులు ఆశ్చర్యపడి కుండమూఁతఁదీసి చూడఁగాఁ గాళింగుని శిరస్సునఁ దాండవము చేయునట్టి స్వరూపముగల కృష్ణుని విగ్రహముండెను. బౌద్ధులు పరాజితులైరి. సుధన్వుఁడు స్వమతము త్యజించెను. మఱియు, ఆసేతుహిమాచల పర్యంతము బౌద్ధులెక్కడనున్నను బాలురైన, వృద్ధులైన, వారిని జంపవలసినట్లు శాసనము గావించెను.

శ్లో॥ ఆసేతోరాతుషారాద్రేః।
బౌద్ధాన్ ఆవృద్ధబాలకం।
నహంతి య స్సహంతవ్యో।
భృత్యానిత్యన్వశాన్నృపః।

శంకరుఁడు వచ్చునప్పటికి గడ్డితోను, పుడకలతోను, గూర్పఁబడి, రవులుకొలుపఁబడియున్న యొక్క చితిపై కుమారిలుఁడు పరుండియుండెను. ఆయనశిష్యులు ప్రభాకరుఁడు మొదలగువారు ప్రక్కను విలపించుచుండిరి. శంకరుఁడు తత్క్షణము తన కమండలువులోని జలముతో నాతని తాపము హరించి, కాలియున్న శరీరమును మరలఁగల్పింప సంకల్పించెను

గాని, కుమారిలుఁ డంగుల కియ్యకొనఁడయ్యె. గురువు వలన బౌద్ధసిద్ధాంత రహస్యముల నెల్ల నెఱిఁగి పిదప బౌద్ధులనోడించి యాయననే రాజాజ్ఞచేతఁ జంపించిన ఘోరపాతకమునకును, కర్మకాండలోని నిత్యనైమిత్తికాదులొనర్చి ఈశ్వర నిరపేక్షకముగానే పురుషుఁడు కృతార్థుఁడు కావచ్చునని తాను జేసిన బోధవలననైన ఈశ్వరోల్లంఘనరూప ద్వితీయ పాతకమునకును ప్రాయశ్చిత్తముగాఁ దాను శరీరత్యాగము కావించుకొనుచున్నట్లును, దనకన్నవధికుఁడైన తనభావమఱఁది మండనమిశ్రుని జయించుటవలన దేశమందు బ్రహ్మవిద్య ప్రతిష్ఠింపవచ్చుననియు, శంకరునకుఁజెప్పి, ఆయనవలనఁ దారకోపదేశముఁ బడసినవాఁడై కుమారిలుఁడు తనఘోర ప్రతిజ్ఞనెఱ వేర్చుకొనియె.

# సప్తమాధ్యాయము.

మాహిష్మతీ పురము రేవానదీతీరముననున్నది. ఇది మగధరాజ్యమందలి పట్టణములలో మిక్కిలి ప్రశస్తమై యొక్కతటి తద్రాజ్యమునకు రాజధానిగానుండెను. ఇక్కడ తనయైశ్వర్యమునకును యశస్సునకును దగినయొక్క దివ్యభవనమ్మున మండన మిశ్రుఁడుండెడువాఁడు. ఇతఁడు పూర్వమీమాంసయందు అనఁగా వేదమందలి కర్మకాండయందు అభిమానముగలిగి జైమిని మతావలంబియై తన్మతము శిష్యసహస్రమునకు బోధించుచుండెను. ఇతనిపాండిత్యము జగద్విదితముగానుండె. ఇతనియింటి పంజరములలోని చిలుకలు గోరువంకలుగూడఁ గర్మప్రతిపాదకశ్రుతులు వల్లించుచుండెడునవియఁట! ఈపట్టణమునకు వచ్చిన దినము శంకరుఁడు మండన మిశ్రుని యిల్లేదియని కొందఱు పురస్త్రీల నడుగఁగా వారీక్రింది చందమునఁ బ్రత్యుత్తరమిచ్చినట్లు శంకర విజయముల యందున్నది.

శ్లో॥ స్వతః ప్రమాణం పరతః ప్రమాణం।
కీరాంగనాయత్రగిరంగిరంతి।
ద్వారస్థనీడాంతర సన్నిరుద్ధాః।
జానీహి తన్మండన పండితౌకః॥ మాధవాచార్యులు.

శ్లో॥ గాయంతిసామానిచ యత్రశార్యః।
స్తువంతికీరాయజుషాబుచాచ।
పరస్పరంసుస్వర మాదరేణ।
జానీహి తన్మండన మిశ్రధామ॥ చిద్విలాసయతీంద్రులు.

అనఁగా నేయింటిముంగిటి కాంచన రత్నపంజరముల లోనున్న శారికలు కీరములుగూడ, శాస్త్ర కథాప్రసంగము లావర్తించుచుండునో, ఆయిల్లు మండన మిశ్రుని మందిర ముగాఁ దెలిసికొనుమని యాశ్లోకములభావము.

శంకరుఁడు ఈయనతో వాదింపవచ్చిన దినము ఇతని యింటఁ బిత్రుకార్యము. తలుపు మూసియుండుటను జూచి, యోగబలమున శంకరుఁడు ఆకాశమార్గమున నతని యింటి లోనికి దిగివెను. మండనమిశ్రుఁడు సన్న్యాసుల దర్శనము చేయఁడు. శిఖా యజ్ఞోపవీతములు త్యజించి, నిత్యనైమిత్తి కాది కర్మలను వదలి కాషాయ వస్త్రములతో దినమున కొకయూరుగాఁ దిరుగు సన్న్యాసులు వేదబాహ్యులనియు గర్హ్యులనియు నాతనియాశయము. కాఁబట్టి యాకస్మికముగా నాకాశమునుండి యింటిలోనికి శ్రాద్ధ సమయమునకు దిగిన యాయనను జూచి మండనమిశ్రుఁడు పరుషోక్తులాడసాగెను ; కాని, యావఱకే యచ్చటకివచ్చి శ్రాద్ధ కర్మయందు నిమం త్రితులై యున్న ఇద్దఱు బ్రాహ్మణులును-వీరిలోనొకఁడు జైమిని, వేఱొకఁడు వేదవ్యాసుఁడు-అతనిని సమాధానపఱిచి 'అభ్యాగతస్స్వయం విష్ణుః' అనియున్నది కాఁబట్టి యీవచ్చిన యతీశ్వరుఁడు పూజనీయుఁడనిరి. మండనుఁడు గురువుల యాజ్ఞ నుల్లంఘింప నేరక, శంకరు నర్చించి భిక్షకు నిలువుఁడని ప్రార్థిం చెను. "నాకుఁ గేవల భిక్షవలనఁ దృప్తిలేదు. నీవలన వాదభిక్ష కోరివచ్చితిని. నేను ఓడిపోయిన నీకు శిష్యుఁడనై గృహస్థాశ్ర మము స్వీకరించెదను. నీవోడితివా ? నాకుశిష్యుఁడవై నీవు

సన్న్యాసము గ్రహింపవలయును. వాదమాడక 'జితోఽస్మి' యన్నను సంతసమే" యని శంకరుఁడు కోరెను. మండనుఁడు వాదించుటకు ఒప్పుకొనెను. మధ్యస్థగా మండనుని భార్య 'భారతి' యే యుండఁదగునని జైమినియు వ్యాసుఁడును నుడివిరి. ఇట్లు వివాదము ప్రవృత్తమై ఆఱుదినములు జరిగెను. తొల్దొల్త మండనుని పక్షము కొంత ప్రబలముగా నున్నట్లు కనఁబడినను, ఆయన బలము క్రమముగా క్షీణించి, జయాప జయ నిర్ణయార్థము భారతీదేవి యిాయిర్వురి కంఠములందు వేసిన పుష్పమాలికలలో, మండనుని మాలిక వాడిపోఁదొడఁ గెను. ఇదిగాంచి భారతీదేవి "భార్య భర్త కర్ధాంగి కావున భర్తను జయించినంత మాత్రమున నీవిజయము సంపూర్ణము గానేరదు. నీవునాతో వాదింపవలయు" నని శంకరుని వేఁడుకొని పూర్వము గార్గి యాజ్ఞవల్క్యునితోను, సులభ జనకునితోను వాదించిన యాచారము నుదాహరించెను. ఈభారతీదేవికి ఇట్టిపాండిత్య మెట్లు ఘటిల్లినదని సంశయము కలుగవచ్చును. కాని ఈమె దుర్వాసుని శాపముచే భూలోకమున నవతరించిన సరస్వతీదేవి యని తెలిసికొనినచో నీసంశయము నిరస్తమగును. ఇదిగాక మహమ్మదీయులు మనదేశమునకు రాకమున్ను స్త్రీలు పురుషులవలెనే తమకుఁ దగిన స్వాతంత్ర్యముగలవారై విద్య నేర్చుకొను నాచారముగలిగి యున్నట్లు ఊహింపఁదగియున్నది. అందిఱును భారతీదేవివలె నపారవైదుష్యమును బొందకున్నను కొంతవఱకుఁ గులాంగనలు ఇప్పటికన్న విద్యావతులుగానే యుండిరని చెప్పనొప్పియున్నది. ఈ భారతీదేవి యొక్క పేరు

'సరసవాణి' యనియు, ఈమె శోణానదీ తీరమున నివసించు విష్ణుమిత్రుఁడను బ్రాహ్మణునియొక్క కూఁతురనియు దుర్వాసుఁడు బ్రహ్మసభలో నొక్కపరి వేదాధ్యయనముచేయునెడ, స్వరస్ఖలనము గలుగఁగా, ఆయనను అపహాసించిన హేతువున భూలోకమున జన్మించి బ్రహ్మాంశసముద్భవుఁడైన మండన మిశ్రుని వరించెననియు చిద్విలాసుని గ్రంథమునఁ జెప్పఁబడి యున్నది.

ఈమె శంకరునితోఁ బదియేను దినములు వాదించెను. ఈలోపల సర్వశాస్త్రములు ఆలోడితము లయ్యెను. దినములు జరుగు కొలఁది శంకరుని సర్వజ్ఞత్వము వెల్లడి యగుచుండెను. ఇట్టి సందర్భములో, తానోడిపోవుట నిశ్చయమని తెలిసికొని శంకరుని వంచింపనెంచి ఆయన బ్రహ్మచర్యమునుండి సన్న్యసించినవాఁడు గావున, రతిరహస్యముల నెఱుంగఁడని యూహించి, కామకళా శాస్త్రమందు ఆయనను బ్రశ్నింపసాగెను.

"శ్లో॥ కలాః కియంత్యో వద పుష్పధన్వనః।
కిమాత్మికా కించపదం సమాశ్రితాః।
పూర్వేచపక్షే కథమన్యథా స్థితిః।
కథంయువత్యాంకథమేవ పూరుషే॥"

శంకరుఁడు 'దేవీ! నాకు మాసమాత్రము వ్యవధాన మిత్తువేని, నీప్రశ్నకుత్తరము చెప్పెదను,' అని నెలదినములు సరస్వతీదేవివలన గడువుతీసికొని, ఆశ్రమ నియమమునకు భంగము కలుగకుండ నెందేని రతిరహస్యములు గ్రహింప నెంచి, గగనమ్మున కుద్గమించెను.

ఆసమయమున మిక్కిలి యల్లకల్లోలముగ నున్న యొక్క పట్టణము దూరమున శంకరునకు దృగ్గోచరమయ్యెను. పరికింపఁగా స్వర్గచ్యుతుఁడైన మహేంద్రుఁడునుబోలె ఆపట్టణము పాలించు ప్రభువు చనిపోయి పడియుండెను. ఆ శవసమీపమున, అప్సరసలవలె శృంగారవతులైన భార్యలు పెక్కండ్రు విలపించుచుండిరి. ఇతఁడు అమరకుఁడు. ముందటిరాత్రి అరణ్యమునకు వేఁటకుఁబోయి వడగొట్టి యాతఁడు చనిపోయెను. శరీరమందు జీవకళ యేమాత్రము దప్పక, బ్రతికియున్నవాఁడు వోలె నుండెను, అప్పుడు పద్మపాదునితో శంకరుఁడు "ఈశరీరము నాకుఁ బ్రవేశ యోగ్యముగాను, ఈవిలాసినులునాకు అనంగతంత్రము నేర్పఁగల ప్రౌఢలుగాను తోఁచుచున్నారు. పరకాయ ప్రవేశ విద్యచేత నేనీరాజుదేహమందుఁ బ్రవేశించి, కుసుమాస్త్ర శాస్త్రమును సాకల్యముగా నభ్యసించి సరస్వతీదేవి చేసిన వంచనకుఁ బ్రతిక్రియ గావించెదను. నేనుమరలునంతకు నాశరీరము మీరు కడునేర్పుతోఁ గావవలయును" అని చెప్పి యోగమార్గమునఁ బ్రాణములఁదనమేనినుండి యుత్క్రమింపఁజేసి యమరకుని శరీరము ప్రవేశించెను. అమరకుఁడు నిద్రనుండి పోలె మేల్కొనెను. ఇఁకఁ, బౌరులయొక్కయు, విశేషించి యంతఃపురకాంతల యొక్కయు సంతోషము వర్ణింపవలయునా?

పద్మపాదుఁడు నర్మదాతీరమందలి యరణ్యములో నిర్మానుష్యమైన యొక్కచోట, నొక్క తరుకోటరమున శంకరుని శరీరమునుదాఁచి, తానును, దక్కిన శిష్యులును దానిని

గాపాడు చుండిరి. ఇక్కడ, శంకరుఁడు అమరకుని యంతఃపుర మున షోడశసహస్రస్త్రీపరివృతుఁడైన శ్రీకృష్ణునివలె సిష్టోప భోగము లనుభవించుచుండెను. మజ్జన భోజనాదులకువలయు కాలము దప్ప తక్కిన కాలమంతయు శంకరుఁడు కామకేళీ పరాయణుఁడై కాంతలతోడ ద్యూతప్రచారముల యందును, సంగీత ప్రసంగములయందును నృత్యనాటక దర్శనముల యందును గడపుచుండెను. ఒక్కొక్కయెడ, సుందరీబృందముతోఁగూడి యుద్యానవనవిహారములకుఁ బోవును. ఒక్కయెడ, వారితోఁగూడి రమ్యములైన కాసారములయందు కరిణీ పరివృతమైన కరీంద్రమువోలె విహరించు. వేయేల? ఈకాలమున శంకరుని భోగము వర్ణనాతీతమై సహస్రాక్షునకుఁ గూడ నభిలషణీయముగానుండెను. ఇట్లు శృంగార రసార్ణవ నిమగ్నుఁడై శంకరుఁడు స్వస్వరూపమును మఱచె!! ఓహో! విషయములు విషసమానములుగదా! త్రిలోక గురువు సిద్ధ పురుషుఁడు శంకరుఁడే స్త్రీసాంగత్యమున తన స్వరూపమును, తానువచ్చిన పనియును విస్మరింపఁగా, నిఁక, సామాన్యుల మాట చెప్పనేల?

"శ్లో॥ స్మితేన భావేన చలజ్జయాభియా।
పరాఙ్ముఖైరర్ధకటాక్షవీక్షణైః।
వచోభిరీర్ష్యాకలహేన లీలయా।
సమస్తభావైః ఖలుబంధనం స్త్రియః॥"

అను సుభాషితోక్తి సుప్రసిద్ధముగదా!

# అష్టమాధ్యాయము.

ఇట్లు విషయలాలసుఁడై స్వస్వరూపమును మఱచి శంకరుఁడు అంతిపురమున శృంగార సముద్రమున నోలలాడుచుండఁగా, అమరకుని యమాత్యులు ఆతని ప్రవర్తనల యందలి భేదమును ఆయన యసామాన్యమైన శేముషీవిశేషమును లక్షించి ఇతఁ డమరకుఁడుగా నుండఁడనియు నెవఁడో మహాపురుషుఁడు ఏదోనిమిత్తమున నీ రాజుశరీరమును బ్రవేశించి యున్నాఁడనియుఁ నిశ్చయించి, ఆ మహాపురుషుఁడు తనశరీరము నెందేని గుప్తము గావించియుండ నోపునని యూహించి, గిరిగుహారణ్యముల నెందైన నెవ్వరిచేనైన దేహము దాఁచఁబడి కాపాడఁబడుచుండెనేని దానిని గాల్పవలయునని శాసనముగావించిరి. ఈ శాసనమున శంకరునిచేతనే చేవ్రాలు చేయించిరి గాఁబోలు! ఇట్లు ముప్పది దినములు క్షణమాత్రముగాఁ గడచిపోయెను. శిష్యులు శంకరుఁడు స్వశరీరమందు సముత్థితుఁడగునని ప్రతిదినమును ప్రతీక్షించుచుండిరి. గడువు దినము సమీపించుటయేగాక యదిగడచికూడఁబోయెను. పైపడి రెండు మూఁడు దినములు కూడనయ్యె. ఈలోన నమరకుని మంత్రులచేతఁ బంపఁబడిన చారులు గుప్తశరీరములఁగాల్చుచున్నారను కింవదంతి పద్మపాదుని చెవినిబడియె. ఇఁకఁగాలవిలంబము కాఁగూడదని నిశ్చయించి, కొందఱు శిష్యులను మాత్రము శంకరుని శరీరమును గాపాడుటకు నియోగించి పద్మపాదుఁడు గొందఱు

శిష్యులను పిలుచుకొని యెట్లో యమరకుని రాజ్యము ప్రవేశించి, యితరవిధముల నసాధ్యమగుటఁజేసి గాయక వేషముల నారాజు సన్నిధానమును గల్పించుకొని, యన్యాపదేశముగా శంకరునికి ఆయన వృత్తాంతమంతయు నివేదించిరి.

ఉ॥ కమ్మని తేనెలాను తమకమ్మున మేను నెఱుంగకిట్లు భృం
గమ్మ! ప్రఫుల్ల తామరసగర్భములన్ విహరించె దిచ్ఛమైఁ
గ్రమ్మెడిసాంధ్యరాగము దిరమ్ముగఁ దమ్మి ముడుంగునింక నీ
విమ్మధులోభమున్ వదల వేని దమిన్ బడిపోదు వయ్యయో !॥

శంకరుఁడు ప్రబోధితుఁడు కాఁడయ్యె. అటమీఁద పద్మపాదుఁడు శంకరుఁడు కావించిన పరమార్థ బోధలోని సారాంశమునంతయు శ్లోకములుగా గానము చేయసాగెను.

శ్లో॥ నేతి నేత్యాది నిగమవచనేన నిపుణం ।
నిషిధ్యమూర్తామూర్తరాశిం ।
యదశక్యనిహ్నవం స్వాత్మరూపతయా ।
జానంతికోవిదాస్తత్త్వమసి ; తత్త్వం ॥ 1

ఇదికా దిదికాదని సకలమైన మూర్తామూర్త పదార్థములను నిషేధింపఁగా, సర్వనిషేధావధీభూతమైన యేసాక్షిని విద్వాంసులు స్వాత్మరూపముగా నెఱుంగుచున్నారో అట్టి తత్త్వమవుగాని, నీవు అమరకుఁడవుకావు.

శ్లో॥ ఖాద్య ముత్పాద్యవిశ్వమనుప్రవిశ్యగూఢం ।
అన్నమయాదికోశతుషజాలే కవయో ।
వివిచ్యయుక్త్యవఘాతతోయ ।
తండులవదాదదతి తత్త్వమసి ; తత్త్వం ॥ 2

అవఘాతముచేత వడ్లనుండి బియ్యమును బడయునట్లు శ్రవణమననములచేత పంచకోశాంతరస్థమై గూఢమైయున్న యేబ్రహ్మమును విద్వాంసులు గ్రహించుచున్నారో, అట్టి తత్త్వమవుగాని, నీవు అమరకుఁడవుగావు.

శ్లో॥ విషమవిషయేషు సంచారిణోఽక్షాశ్వాన్ ।
దోషదర్శన కశాభిఘాతతః ।
స్వైరం సన్నివర్త్య స్వాంతరశ్మిభి ర్ధీరాః ।
బధ్నంతి యాత్రతత్త్వమసి ; తత్త్వం ॥ 3

విషమస్థలములందు దుముకులాడు గుఱ్ఱములను కొరడా దెబ్బలచేత మరలించి పగ్గములచేత బిగఁబట్టి యిష్టస్థానమును జేర్చు నాశ్వికులవలె దోషదర్శనముచేత నింద్రియముల నింద్రియార్థములనుండి మరలించి మనోవృత్తిరూపమైన జ్ఞానముచే బిగఁబట్టి విద్వాంసులు ఏబ్రహ్మమందు బంధించుచున్నారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవుగావు.

శ్లో॥ వ్యావృత్తజాగ్రదాదిష్వనుస్యూతం ।
తేభ్యోఽన్యదివపుష్పేభ్య ఇవసూత్రం ।
ఇతియదౌపాధికత్రయపృథక్త్వేన ।
విదంతిసూరయస్తత్త్వమసి ; తత్త్వం ॥ 4

జాగ్రత్స్వప్నసుషుప్తులను మూఁడవస్థలయందును పూలయందు దారమువలె ననుస్యూతమై తద్విలక్షణమైయున్న యేస్వప్రకాశమును విద్వాంసులు నిరుపాధికమైన బ్రహ్మస్వరూపముగాఁ దెలిసికొనుచున్నారో, అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవుగావు.

శ్లో॥ పురుష ఏవేదమిత్యాది, వేదేషు ।
సర్వకారణతయాయాస్య సార్వాత్మ్యం ।
హాటకస్యేవమకుటాది తాదాత్మ్యం ।
సరసమామ్నాయతే।తత్త్వమసి ; తత్త్వం ॥ 5

కటక మకుట కుండలాది భూషణములు బంగారమునకన్న వేఱు కానట్లు. సర్వకారణమైన యేపురుషునికన్న ఈజగత్తు వేఱు కాదని వేదములు ఘోషించి చెప్పుచున్నవో, ఆతత్త్వమవుగాని నీవు అమరకుఁడవు కావు.

శ్లో॥ యశ్చాహమత్రవర్ష్మణి భామిసోసౌ ।
యోసావిభాతిరవి మండలే సోహమితి ।
వేదవాదినోవ్యతిహారతోయ ।
దధ్యాపయంతి యత్నతస్తత్త్వమసి ; తత్త్వం ॥ 6

ఈశరీరమునఁ బ్రకాశించు పురుషుఁడెవఁడో వాఁడే సూర్య మండలమునందుఁ బ్రకాశించువాఁడు. సూర్యమండలమందుఁ బ్రకాశించు పురుషుఁడెవఁడో వాఁడే యీశరీరమందుఁ బ్రకాశించువాఁడు. ఇట్లని వేదవాదులు ఏపరమార్థమును బోధించుచున్నారో, అట్టి తత్త్వమవుగాని నీవమరకుఁడవు కావు.

శ్లో॥ వేదానువచన సద్దానముఖధర్మైః ।
శ్రద్ధయానుష్ఠితైర్విద్యయాయుక్తైః ।
వివిదిషంత్యత్యంత విమలస్వాంతా ।
బ్రాహ్మణాయద్బ్రహ్మతత్త్వమసి ; తత్త్వం ॥ 7

వేదోక్తములైన కర్మల చేతను, ఉపాసనలచేతను అత్యంత విమలస్వాంతులైన బ్రాహ్మణులు ఏపరతత్త్వమును

ఎఱుంగ నిచ్ఛగించుచున్నారో, అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవుకావు.

శ్లో॥ శమదమోపర మాదిసాధనైర్ధీరాః।
స్వాత్మనాత్మని యదన్విష్య కృతకృత్యాః।
అధిగ తామితసచ్చిదానందరూపా।
నపునరిహ ఖిద్యంతే తత్త్వమసి; తత్త్వం॥ 8

బాహ్యేంద్రియ, అంతరింద్రియ నిగ్రహాదిరూప సాధనములచేత, సచ్చిదానంద రూపమైన యేపరబ్రహ్మమును గనుఁగొని, ధీరులు జననమరణాది లక్షణమైన యీసంసారమునకుఁ దిరిగిరారో, అట్టితత్త్వమవుగాని నీవమరకుఁడవుగావు :— -

అమృత తరంగములుపోలె, వేదమునుండి తానుద్ధరించిన ఈయద్వైతానుభవభావములు చెవిసోఁకఁగా శంకరునికి స్మృతిగలిగి తత్క్షణము హేయమైన యమరుకుని కాయమునువీడి వేదతుల్యమైన స్వశరీరమందు సముత్థితుఁడయ్యె. అమరకుఁడు చనిపోయెను. శంకరుఁడు తనశరీరము ప్రవేశించుటకుమున్నె యమరకుని చారులు శరీరమును దరిసి శిష్యుల నిగ్రహించి పాదములకు నిప్పంటించి యుండిరి. శంకరుఁడు అవ్యవధానముగా నారసింహుని ధ్యానించి తనశరీరమును తొల్లిటివలెఁ గాపించికొనెను. ఈధ్యానశ్లోకములు "లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబం" అనుమకుటము గలిగి నేఁటికిని దేశమందు వ్యాప్తిలోనున్నవి. ఇందులో నొక్కటి కేవల సందర్భోచితముగా నున్నందున నిందుఁగ్రిందఁ బొందుపఱుచుచున్నాను.

"శ్లో॥ సంసార ఘోరగహనే చరతో మురారే।
మారోగ్ర భీకర మృగప్రవరార్దితస్య।
ఆర్తస్య మత్సర నిదాఘనిపీడితస్య।
లక్ష్మీనృసింహ! మమ దేహికరావలంబం॥"

ఇట్లు యోగబలముచే వ్రతభంగము కాకుండ గళా శాస్త్రము నభ్యసించి మరల మండన మిశ్రుని యింటికి శంకరుఁడు విచ్చేసెను. మండన మిశ్రుఁడు శంకరునికి శిష్యుఁడయ్యెను. సరస్వతియుఁ దానోడిపోవుట యొప్పికొని, శంకరుఁడు నిర్మింపఁగల ఋశ్యశృంగాది పీఠములలోఁ దానుండి భక్తుల కోర్కులీడేర్చుట కంగీకరించి సదస్యుల యెదుటనే యంతర్ధానమొంది బ్రహ్మలోకమునకుఁ బోయెను. మండన మిశ్రుఁడు శంకరునివలన సన్న్యాసమును గ్రహించెను. సురేశ్వరాచార్యుఁడను పేరుతో శృంగగిరి పీఠమునకువచ్చి తైత్తిరీయకాణ్వోపనిషత్తులకు వార్తికము వ్రాసినది, యీమండన మిశ్రుఁడే.

సర్వజ్ఞ పీఠారోహణమునకు వెనుక, శంకరుఁడు కావించిన కార్యములలోనెల్ల మండనమిశ్రుని జయించినది ముఖ్యతమమైనదిగా నెన్నఁదగియున్నది. ఈవిజయమువలన దేశమునఁ బూర్వమీమాంసకుల యౌన్నత్యము కథాశేషమై జనులు స్వస్వరూపమైన నిర్గుణ పరబ్రహ్మము నన్వేషింప సాగిరి. పూర్వమీమాంసా స్వరూపమెట్టిదో శంకరుఁ డేయుక్తులతో దానిని ఖండించెనో తెలిసికొనుట మనకావశ్యకమైనను, వేదాంతశాస్త్ర పరిచయములేక దానిని సమగ్రముగా నెఱుఁ

గుట దుర్ఘటముగాపున, ఆంధ్రశారీరకములోనున్న కొన్ని యంశములనుండి గ్రహించి తత్స్వరూపము నిచ్చుట సంక్షేపముగా నివేదించుచున్నాను :—

బ్రహ్మమునకు శాస్త్ర ప్రమాణకత్వములేదని అనఁగా వేదమందు ఎందుఁగాని బ్రహ్మస్వరూపమును బ్రతిపాదించు భాగములేదని పూర్వ మీమాంసకుల వాదము. పూర్వమీమాంసా సూత్రకారుఁడు జైమినిముని. తత్సూత్ర వ్యాఖ్యాతలు భట్టప్రభాకరులు. వీరు గురుశిష్యులు. వీరిమతములోఁ గొన్ని యంశములయందు బోధాయన వృత్తికారుఁడును ఏకీభవించుచున్నాఁడు. ఇందుభట్ట ప్రభాకరులు బ్రహ్మము లేదనియు, వృత్తికారుఁడు బ్రహ్మము కలదనియుఁ దలంచుచున్నారు. వేదములయందు సిద్ధ *వస్తుపరములగు వాక్యములున్నవని భట్ట బోధాయనులును లేవని ప్రభాకరుఁడును జెప్పుచున్నారు. మఱియును శబ్దములకుఁ †కార్యాన్వితమందే శక్తికలదుగాని, సిద్ధార్థమందు శక్తిలేదని బోధాయన ప్రభాకరులును వానికి సిద్ధార్థమందే శక్తికలదని భట్టుఁడును, వాదించుచున్నారు. ఈసిద్ధవస్తుపరములగు వాక్యములు కర్మవిధి శేషములేయని భట్టుఁడును, ఉపాసనా విధిశేషములు కూఁడనని బోధాయనుఁడును జెప్పుచున్నారు.

---

* ఇదివఱకే యున్న పదార్థము :—దృ॥ ఆజ్యము - సమిధలు - ఇత్యాది.

† ఏదో యొక వ్యాపారముతో సంబంధించియుండుట; దృ॥ హోమనుచేయుట, తెచ్చుట ఇత్యాది

అద్వైతసిద్ధాంతము.

శంకరుని మతమున బ్రహ్మము తక్క వేఱేదియును లేదు. ఉన్నట్లుతోఁచు సర్వమును బ్రహ్మమందు ఆరోపితముగా నున్నది. అనఁగాఁ బరమార్థమున, జగత్తు లేదు; జీవుఁడు లేఁడు; ఈశ్వరుఁడు లేఁడు. ఈమూఁడును బ్రహ్మమందుఁ గల్పితములై యున్నవి. రజ్జువందు (త్రాటియందు) సర్పము త్రికాలములయందు లేదు. కాని భ్రాంతికాలమందుఁ, ద్రాడు కనఁబడక సర్పము కన్పట్టుచున్నది. భ్రాంతిపోఁగానే, కల్పితమైన సర్పము అభావమై రజ్జువు శేషించుచున్నది. అట్లే జీవునియొక్క యథార్థ స్వరూపము పరబ్రహ్మము. అవిద్యవలనఁ దన్ను నామరూపాత్మకునిగాఁ దలంచికొని జీవుఁడు కర్తృత్వ భోక్తృత్వరూప సంసారమునఁబడి భ్రాంతుఁడగుచున్నాఁడు. రజ్జువును జూచి సర్పమని భ్రమించి భయపడువానికి సర్పభ్రాంతి రజ్జుస్వరూపావధారణమువలనఁ దక్క నితర విధముగాఁ బోనట్లు వేదాంత విచారముచేతఁ గలుగు బ్రహ్మ స్వరూప నిశ్చయము వలనఁగాక, పురుషునకు జీవత్వభ్రాంతి పోనేరదు. ఈభ్రాంతి నివారణమునందు యజ్ఞాది కర్మలు అసమర్థములు. పంచాగ్ని విద్య, దహరవిద్య ఇత్యాదులయందుఁ జెప్పఁబడిన యుపాసనలు నిరర్థకములు. శ్రవణ, మనన, నిధిధ్యాసరూపమైన తత్త్వ విచారముదక్కఁ దక్కిన దేదియు నీభ్రాంతిని దొలఁగింపనేరదు. తేజస్సువలనఁగాక, తక్కిన యేకారణమువలనను అంధకారము నివర్తింపనట్లు, అజ్ఞానమూలకమైన యీ భ్రాంతి జ్ఞానము వలనఁగాని తొలంగనేరదు. ఈజ్ఞానము బ్రహ్మాత్మైక్య బోధ

రూపకము. దీనికి శ్రవణాది త్రితయమొక్కటియె కారణము. ఇది వేదాంతములయొక్క పరమాభిప్రాయముగనున్నది.

భట్టుని మతమున వేదమందలి సిద్ధవస్తుపరములగు వాక్యములన్నియుఁ గర్మవిధిశేషములు. సిద్ధవస్తుపరవాక్యములనఁగా "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" ఇత్యాదులు. ఇవి క్రియా పదములు కావు గావున, వీనినిఁ బ్రకరణమందున్న క్రియా పదములతో నన్వయింపవలెనని యీతని యాశయము. ఇట్లన్వయింపఁగా నవి కర్మ విధిశేషములగును. ఉ॥ "వజ్రహస్తః పురందరః" అని వేదముననొక్క సిద్ధవస్తుపరవాక్యమున్నది. దానికిముందు "ఇంద్రంయజేత" యనువాక్యమున్నది. 'ఇంద్రయజేత' అనఁగా నింద్రునిగూర్చి యజ్ఞమును జేయుమని యర్థము. 'వజ్రహస్తః పురందరః' అనఁగా నా యింద్రుఁడు వజ్రహస్తుఁడని యర్థము. "వజ్రహస్తః పురందరః" అను సిద్ధవస్తుపరవాక్యము ఈప్రకరణమున "ఇంద్రంయజేత" యనుఅను కర్మవిధి వాక్యమునకు శేషమైయున్నది. ఇట్లే, ఆత్మ ప్రతిపాదకములని చెప్పఁబడు వేదాంత వాక్యములన్నియుఁ గర్మవిధి శేషములైయున్నవని భట్టుని సిద్ధాంతము. బోధాయనుని మతమున నీవాక్యములు కర్మవిధిశేషములు మాత్రమేగాక, యుపాసనావిధి శేషములుగాఁ గూడనున్నవి. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అను సిద్ధవస్తుపర వాక్యము "ఆత్మేత్యేవోపాసీత" యను నుపాసనావిధి వాక్యమున కంగముగానున్నది.

ఇచ్చట భట్టాదుల వాదస్వరూపమును సంపూర్ణముగాఁ దెల్పి దానికి శాంకరుల సమాధానము వ్రాయుట సముచిత

ముగానున్నను, గ్రంథవిస్తరభయముచే నట్లుచేయుటనుజ్జగించి సమాధానముల మాత్రము పొందుపఱుచు చున్నాము. ఈ సమాధానములఁబట్టి చదువరులు అక్షేపణల నూహించి కొనవచ్చును.

భట్టుని వాదమునకు సమాధానములు.

(1) ఏకమేవాద్వితీయం, ఆత్మావాఇదమేక ఏవాగ్ర ఆసీత్, ఇత్యాది వాక్యములు స్పష్టముగా బ్రహ్మస్వరూపమును బ్రతిపాదించు చుండఁగా, వానిని గర్మవిధపరములగా నన్వయించుట యుక్తముగాదు. జ్ఞానకాలమునఁ గర్తయే లేఁడు. ఇఁకఁ గర్మమెక్కడిది? ఈయర్థమును 'తత్కేన కం పశ్యేత్' ఇత్యాది శ్రుతులు నిశ్శంకముగా బోధించుచున్నవి.

(2) బ్రహ్మము స్వతస్సిద్ధ పదార్థమైనను అనఁగాఁ గ్రొత్తగా వచ్చునదిగాక ఎప్పటికిని ఉండునదియైనను, ఘటాదులవలె నేత్రాదివిషయముకానేరదు. కావునఁ దదవగతికి శాస్త్రమావశ్యకముగానున్నది.

(3) బ్రహ్మము త్యజింపఁ దగినదికాదు. స్వీకరింపఁ దగినదికాదు. తనకన్న భిన్నమగుదాని వదలవచ్చుఁ గైకొనవచ్చుఁగాని, తన్నుఁదా వదలుటెట్లు? గ్రహించుటెట్లు? బ్రహ్మమే యీయాత్మ స్వరూపమై యుండుటచే, నది హేయముకాదు. ఉపాదేయమునుగాదు. బ్రహ్మము హేయోపాదేయ శూన్య మయినను, బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానము సర్వక్లేశ వినాశకరమగుటచేఁ దదుపదేశము పరమపురుషార్థ సాధనమై యున్నది. అత్మకన్న నెక్కుడై పొందఁదగినది వేఱొకటి

లేదని "పురుషాన్న పరంకించిత్ – సాకాష్ఠాసాపరాగతిః" అని కఠశ్రుతి చెప్పుచున్నది.

(4) వేదములందు ఉపాసనాపరములగు వాక్యములు లేకపోలేదు. ఉపాసనలవలనఁ బ్రయోజనమును లేకపోలేదు. వేదాంతవాక్యము లన్నియు ఉపాసనాపరము లనుట మాత్ర మసంగతము. 'సర్వం ఖల్విదంబ్రహ్మ నేహనానా స్తి కించన' ఇత్యాది వాక్యములవలన జ్ఞానకాలమున నుపాసనా సాధ్య మగు ఫలము లేదనుట స్పష్టముగదా ?

ప్రభాకరుని వాదమునకు సమాధానములు.

(1) ఔపనిషద (ఉపనిషత్తులందు బోధింపఁబడిన) పురుషుఁడగు పరమేశ్వరుఁడే సర్వానుభవసిద్ధమగు జీవాత్మ స్వరూపమునుబొంది "ఇదిలేదు. – అదిలేదు" అని సర్వ నిషేధము చేయువాఁడగుటచే వాఁడు లేఁడనిగాని తెలియఁ బడఁడనిగాని చెప్పుట యసంభావ్యము.

(2) అహంప్రత్యయ విషయుఁడై అనఁగా 'నేను' 'నేను' అనుమాటకు లక్ష్యభూతుఁడై యాత్మ గోచరుఁడై యున్నను, ఆయాత్మయొక్క స్వరూపమిట్టిదని తెలిసికొనుటకు శాస్త్రము ఆవశ్యకము. కావుననే 'తంత్వౌపనిషదంపురుషం పృచ్ఛామి' యను శ్రుతిపురుషుఁడు ముఖ్యముగా ఉపనిష త్తులవలననే దెలియఁబడఁ దగినవాఁడని బోధించుచున్నది.

(3) ఔపనిషద పురుషుఁడే యందఱి యాత్మస్వరూ పుఁడై యుండి వాఁడే సర్వప్రమాతయగుటచే, శబ్దేతర ప్రమా ణములకు దేనికి వాఁడు విషయము కాఁజాలఁడు. చూచు

వాఁడు చూపునకెక్కుడనైన విషయమగునా? ఇట్లున్నను, జూచువాఁడు లేఁడనవచ్చునా? ఇటులే సర్వసాక్షియగు నాత్మయుఁ బ్రత్యక్షాదివిషయుఁడు కాకున్నను, వాఁడు లేని వాఁడనఁ జెల్లదు.

బోధాయనుని వాదమునకు సమాధానములు.

(1) ఉపాసకుఁడు, ఉపాస్యము, ఉపాసన యను త్రిపుటి నపేక్షించుచు ఉపాసనాకర్మము ద్వైతజ్ఞానాశ్రయమై యున్నది. శ్రుతియందు బోధింపఁ బడిన బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానము సమస్తద్వైతజ్ఞాన వినాశకరమై ద్వితీయాసహమై యున్నది. తనకన్న భిన్నమగు రెండవ వస్తువున్నఁగదా ఉపాసన సాధ్యమగును? 'యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్' ద్వితీయవస్తు జ్ఞానమున్నంతవఱకు సంసార భయము వీడ దనియు, బ్రహ్మము జ్ఞేయమనియుఁగూడ శ్రుతియే తెలుపుచున్నది. శ్రు॥ యదాహ్యేవేష ఏతస్మిన్ను దరమంతరం కురుతే అథతస్యభయంభవతి' కావున ఉపాసనా క్రియకు బ్రహ్మము కర్మము కాఁజాలదు.

(2) స్వర్గనరకాది లోకములవలెఁ గర్మజన్యముగాక మోక్షము స్వతస్సిద్ధమై నిత్యమైయున్నది. బ్రహ్మాత్మభావమే మోక్షము. ఇది యుపాసనాఫలవిలక్షణము.

(3) బ్రహ్మము జ్ఞానక్రియా విషయముగాని యుపాసన క్రియావిషయముకాదని శ్రుతులు వక్కాణించుచున్నవి. "శ్రు॥ అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి" (బ్రహ్మము విదితమగు కార్యముకంటెనన్యము. అవిదితమగు కారణము

కంటెనన్యము) "యేనేదం సర్వం విజానాతి తం కేనవిజానీయాత్" (ఏ యాత్మచే నీసర్వమును దెలియఁబడుచున్నదో యా యాత్మను దేనితోఁ దెలిసికొన సాధ్యమగును?) "యన్మనసానమనుతే యేనాహుర్మనోమతం । తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదంయదిదముపాసతే" 'మనస్సుతో దేనిని దెలిసికొన సాధ్యముకాదో, ఏది మనస్సును దెలిసికొనునో, దానిని బ్రహ్మముగాఁ దెలిసికొనుము. నీవు ఉపాసించునది బ్రహ్మము కాదు'.

బ్రహ్మము వాక్కునకతీతము మనస్సునకతీతము. ఇట్లయిన నీవిషయమున శాస్త్రము నిష్ప్రయోజన మనరాదు. ఏలయన, అవిద్యాకల్పిత భేదనివృత్తి కొఱకు శాస్త్రము ప్రవర్తించుచున్నదిగాని, బ్రహ్మ మిద్దియని నిర్వచించుటకుఁ గాదు. శాస్త్రజ్ఞానమూలమైన యీయవిద్యానివృత్తి నిత్యముక్త స్వతస్సిద్ధాత్మ స్వరూప సమర్పణము చేయుచున్నది.

(4) మోక్షసాధనమని చెప్పఁబడిన జ్ఞానము మానసిక క్రియయే యగుటచే మోక్షము క్రియాసాధ్యముకాదని చేయఁబడిన సిద్ధాంత మసంగతమైయున్నదని తలంపవలదు. వాని రెంటికిని వైలక్షణ్యము కలదు. ధ్యానాదిక్రియ, వస్తుస్వరూప నిరపేక్షకమై కేవల పురుష చిత్తవ్యాపారాధీనమైయున్నది. శబ్దమాత్రైకవేద్యులగు నింద్రాదులు పురుష చిత్తానుసారముగ నెట్లులయిన భావింపఁబడవచ్చును. జ్ఞానమట్లుగాదు. అది ప్రమాణజన్యము. వికల్పాసహమగు సిద్ధవస్తువు విషయముగాఁ గలది ప్రమాణము. దృ॥ సిద్ధవస్తువు స్తంభము.

తద్విషయక జ్ఞానము వికల్పాసహము. అనఁగా స్తంభమును అన్యవిధముగా భావించుట అనఁగా ఘటమనిగాని సర్పమని గాని భావించుట యసాధ్యము. అనఁగా నీ జ్ఞానము వస్త్వధీనమై పురుష చిత్తాయత్తముగాక యున్నది. అట్లే బ్రహ్మము సిద్ధవస్తువు. తద్విషయక జ్ఞానము వికల్పాసహమై యున్నది. ధ్యానాదులిట్లు గాక, విధివాక్యాధీనములు. పంచాగ్నివిద్య యందు స్త్రీని అగ్నిగా భావింపుమని యున్నదిగదా! అగ్ని యందు అగ్నిబుద్ధి వస్తు తంత్రమై వికల్పాసహమైయున్నది. ఇఁక స్త్రీయందుఁ గలుగవలయు అగ్నిబుద్ధియన్ననో, కేవల విధివాక్యాధీనమై, ఉపాసక చిత్తాయత్తముగా నున్నది. ఇట్లనుటచే బ్రహ్మజ్ఞానము యథాభూత బ్రహ్మాత్మ తత్త్వ విషయమై యున్నదిగాని చోదనాతంత్రముకాదు.

(5) "రజ్జురియం.- నాయంసర్పః" (ఇదిత్రాడు. సర్పముకాదు.) అనువస్తుమాత్ర కథనమువలన లోకమందు భ్రాంతి నివారణమైనట్లుగానె, "తత్త్వమసి - అది (బ్రహ్మము) నీవు అయితివి" అని యుపదేశించిన మాత్రమున జీవత్వ భ్రాంతి నశింపకపోవుటచే బ్రహ్మోపదేశము నిష్ఫలమని వచ్చిన యాక్షేపణ యుక్తముకాదు. ఏలయనఁగా, బ్రహ్మాత్మ భావోపదేశమాత్రమున సంసార నివృత్తికాకున్నను, బ్రహ్మాత్మ సాక్షాత్కార మయినవెనుకఁగూడ సంసారిత్వము నిలుచుననఁ జెల్లదుగదా! అట్టిసాక్షాత్కారమైన తోడనే దేహాభిమానము నశించి పురుషునకు జీవన్ముక్తికలుగుచున్నది. దేహాభిమానమే సుఖదుఃఖ కారణము. తన్నివృత్తికాఁగానే సుఖదుఃఖములు

దేహానంటవు. ధనాభిమానముగల గృహస్థున కతనిధనము పోయినచో దుఃఖము కలుగుచున్నది. వాఁడే ధనాభిమానమును ద్యజించి సన్న్యసించినవెనుక, నతని ధనముపోయెనేని, యాధన నాశనము వానికి దుఃఖమును గలిగింపదు.

మఱియు శరీరాభిమాన రాహిత్య మశరీరత్వముగాని, శరీర పతన మశరీరత్వమున కావశ్యకముకాదు. జీవన్ముక్తుఁడు శరీరాభిమానరహితుఁడై ప్రియా ప్రియముల నంటకయున్నాఁడని శ్రుతిశతములు తెలుపుచున్నవి. మఱియు శ్రవణానంతరము మనన నిధిధ్యాసములు చెప్పఁబడినను, అవన్నియు బ్రహ్మావగతికి ఆవశ్యకములని తాత్పర్యముకాదు. అందొక్కటొక్కటే బ్రహ్మాప్రాప్తిని గలుగఁజేయవచ్చును. అజ్ఞాన, సంశయ, విపర్యయరూపమైన ప్రతిబంధ మెచ్చట గాఢముగా నున్నదో, అచ్చట నీమూఁడును, వీనియావృత్తియుఁ గావలసియున్నది :—

## నవమాధ్యాయము.

ఈప్రకారము ఉత్తర హిందూస్థానమున బ్రహ్మవిద్యా ప్రతిష్ఠాపనము గావించి శంకరుఁడు దక్షిణ దేశమునకు బయలువెడలి మహారాష్ట్ర దేశముమీఁదుగా శ్రీశైలమునకు వచ్చెను. ఈప్రాంతముల నీయన యన్యమత ఖండనము కావించు కాలములోఁ గాపాలికుఁడొకఁడు ఈయనయొద్దకు వచ్చి బహువిధముల స్తోత్రముగావించి ఈయన శిరస్సే తనకు దానమిమ్మని వేఁడుకొనెను. కాపాలికులు భైరవుఁడను దేవత నుపాసన చేయువారలు. ఈ దేవునకు విద్వాంసులైన బ్రాహ్మణుల తలలపైని మిక్కిలి మక్కువయఁట! ఇఁక సర్వజ్ఞుఁడు శంకరుని యుత్తమాంగము అత్యుత్తమమైన నైవేద్యము కాకుండునా? ఈకాపాలికుఁడు శంకరుని దరిసి "స్వామీ! నేను శివభక్తుఁడను. ఈశరీరముతోడఁ గైలాసమునకుఁ బోవ నిచ్ఛగించి చిరకాలము చంద్రశేఖరు నారాధించితిని, ఆదేవుఁడు నాభక్తికిఁ బ్రీతుఁడై నాకుఁగనఁబడి మూర్ధాభిషిక్తుఁడైన రాజుయొక్కగాని, సర్వజ్ఞుఁడైన మహాపురుషుని యొక్కగాని, శిరస్సు తన్నుఁగూర్చి నేను హోమము చేయుదునేని నాకోర్కె ఫలించునని వాక్రుచ్చెను. చక్రవర్తియొక్క శిరస్సు నాకలభ్యమైనవస్తువు కాఁబట్టి, సర్వజ్ఞుఁడైన విద్వాంసుని శిరస్సు కొఱకుఁ బెక్కేండ్లనుండి నే నన్వేషణము చేయుచున్నాను. ఎట్టి విద్వాంసులఁ జూచినను, వారు సర్వవిదులుకారు. నేఁడు

నాభాగ్యవశమున సరస్వతీవిజయము గావించి సర్వజ్ఞతాసిద్ధిఁ బడసిన నీసాన్నిధ్యము చేకూరినది. తమసిద్ధాంతమున శరీరాదికములు మృషామాత్రములుగదా! ఇఁక, నివియున్న నేమి? పోయిననేమి? తాము సర్వలోక హితముకొఱకుఁ గంకణము కట్టికొని దేశాటనము చేయుచున్నవారు గావున, ఈవిషయమున నాకోర్కె తమరు సఫలము గావింపవలయు" నని పలుదెఱఁగులఁ బ్రార్థించెను. శంకరుఁడిందుల కియ్యకొని తాను సమాధియందు శరీరస్ఫురణ తప్పియున్న కాలములో శిష్యుల కెఱుంగరాకుండఁ దనశిరస్సు ఛేదించి తీసికొనిపోవుటకుఁ గాపాలికున కనుజ్ఞయొసఁగెను. కాపాలికుఁడు యుక్తవేషముతో గంధపుష్పాదికముచేత నర్చితమైయున్న నిశిత ఖడ్గమొక్కటి చేతఁబట్టుకొని నియుక్తకాలమునకు శంకరుని యొద్దకువచ్చి, ఆయన యేకాంతమున సమాహితుఁడై యుండుటఁ బరికించి తన్మస్తకము ఛేదించుటకు శీఘ్రముగాఁ జేయి పైకెత్తెను. గాని యద్వైతామృత వర్షము ప్రపంచమందంతటఁ గురియవలసిన శుభయోగ మున్నందున, శ్రీమహావిష్ణువు నారసింహుఁడై పద్మపాదుని శరీరము నావేశించి పూర్వము హిరణ్యకశిపునింబోలె క్షణకాలమున నీకాపాలికుని జంపివేసెను. ఈసంరంభమువలన శంకరుఁడు సమాధినుండి మేల్కొని కన్నుదెఱచి చూచునంతకుఁదనకుఁ గట్టెదుట మహోగ్రాకారుఁడై కాపాలికుని ప్రేవులు కంఠమున ధరించిన నృసింహమూర్తి గనఁబడెను. అప్పుడు శంకరుఁడు, ప్రవర్తిల్లిన వృత్తమునంతయుఁ దెలిసికొని ఆనంద భరితుఁడై

స్వామిని వేనోళ్ళఁగొనియాడి శాంతపఱిచెను. పద్మపాదుఁడు ఘోరమైన దుస్స్వప్నమునుండి వినిర్ముక్తుఁడైన వాఁడు పోలెఁ జూపట్టె.

శంకరుఁడు శ్రీశైలమునుండి గోకర్ణమునకును ఆవల హరిహరాఖ్య తీర్థమునకును బోయెను. మృతుఁడైన బ్రాహ్మణ శిశువునకు శంకరుఁడు ప్రాణప్రదానము గావించినది ఇక్కడ మూకాంబికా దేవాలయములోనే. శంకరుఁడు పిదప శ్రీబలి యను పేరుగల యగ్రహారమునకు వచ్చెను. ఇక్కడఁ ప్రభాకరుఁడను విప్రోత్తముని కుమారుఁడు హస్తామలకుఁడు ఈయనకు శిష్యుఁడయ్యెను.

హస్తామలకుని వృత్తాంతము.

ఈహస్తామలకుని చరిత్రము చిత్రమైనది. ఈయన తొంటి జన్మముననే పరతత్త్వము ననుభవమునకుఁ దెచ్చికొన్న యొక్క సిద్ధపురుషుఁడు. యమునాతీరమున నీయన తపస్సు చేసికొనుచుండఁగా, ప్రభాకరునిభార్య నదీస్నానమునకువచ్చి దోఁగాడు నీడుగల తన కుమారుని ఈయన కప్పగించి తాను యమునలో సఖీసహితయై స్నానముచేయఁబోయెను. ఇట్లు ప్రభాకరునిభార్య స్నానము కావించుచుండఁగా తపస్విని కన్ను మొఱఁగి వడివడిగా దోఁగాడిపోయి బిడ్డఁడు ఏటియందుఁ బడెను. ఆచప్పుడువిని సమీపమున స్నానము చేయుచున్న కొందఱు పరుగెత్తికొనివచ్చి బిడ్డను నదినుండి దరికిఁగొని తెచ్చిరి, గాని యప్పటికే శిశువు గతప్రాణుఁడై యుండె.

ప్రభాకరుని భార్యయును జెలికత్తెలును దపస్వియెదుట పలు విధముల విలపింపఁజొచ్చిరి. తపస్వియుఁ గరుణాతరంగితాంతరంగుఁడై బిడ్డను బ్రతికింతునని తల్లినూరార్చి తనయోగబలమున స్వశరీరమునందుండి లేచి యీబాలకుని శరీరములోఁ బ్రవేశించెను. వాసనాక్షయరూపమైన మౌననిష్ఠ యీతపస్వికిఁ జిరకాలాభ్యస్తమైన వృత్తము కావున నీకుమారశరీరముననుండియు నీయన స్వానుభూతిరసికుఁడై ప్రపంచవ్యాపారవిముఖుఁడై పెరుఁగుచుండెను. తల్లిదండ్రు లితని మౌఢ్యమునకుఁ గారణము గనుఁగొననేరరైరి. భూతావేశము కావచ్చునని కొందఱును, సహజజాడ్యమని కొందఱును బెక్కండ్రు పెక్కుతెఱంగులఁ దలంచుచుండిరి. తండ్రియు పలయునన్ని చికిత్సలు కావించి యెందును మనోరథసిద్ధిఁ బడయనేరక యుపాయాన్వేషణము చేయుచుండెను. కావున, శిష్యసహితుఁడై శంకరుఁడు గ్రామమునకు రాఁగానే ఈయన మహిమ గొంత గొంతము న్నే వినియున్న వాఁడు కావున, ప్రభాకరుఁడు శంకరుని సందర్శించి కుమారుని జడత్వమును విన్నవించి, వానిని శంకరుని పాదములపైఁ బడవైచెను. శంకరుఁడు వృత్తాంతమంతయు సావధానముగావిని బాలకుని లేవఁదీసి, "కస్త్వంకిమేవం జడవత్ప్రవృత్తః" నీవెవ్వఁడవు? ఇట్లు జడుని వలెఁ బ్రవర్తించుటకుఁ గారణమేమి ? యని సంస్కృతమునఁ బ్రశ్నించెను. జన్మించినది మొదలు ఒక్క మాటైనమాటాడని యీ బూటకపు శిశువు తత్క్షణము.

"శ్లో॥ నాహంజడః కింతుజడః ప్రవర్తతే।
మత్సన్నిధానేన నసందిహే గురో।
షడూర్మిషడ్భావ వికారవర్జితం!
సుఖైక తానం పరమస్మితత్పదం॥"

అని ప్రత్యుత్తరముచెప్పి స్వరూప బోధకములైన పండ్రెండు శ్లోకములు వచించెను. శ్రోతలు మూకత్వనివృత్తి కాశ్చర్యపడిరి. శంకరుఁడీతని యనుభావమునకు సంతసిల్లెను. పూర్వోక్త శ్లోకమున కర్థము "నేను జడుఁడనుగాను. మఱి యేమన్న, జడములైన దేహేంద్రియమనోబుద్ధులు నాసన్నిధాన మహిమవలనఁ బ్రవర్తిల్ల సమర్థములై యున్నవి. అట్టినేను జడుఁడ నెట్లగుదు? షడూర్మివర్జితమై షడ్భావవికారవర్జితమై నిరతిశయానందరూపమైన యేపరమపదము గలదో అదియే నాస్వరూపము. ఈవిషయమున సంశయములేదు." తక్కిన శ్లోకములు పండ్రెండింటియందును ఇదేయర్థము అనేక దృష్టాంతములతో నిర్దేశింపఁబడి యున్నది. అందొక్కటిమాత్రము ఉదాహరించుచున్నాను.

శ్లో॥ నిమిత్తం మనశ్చక్షురాది ప్రవృత్తౌ!
నిరస్తాఖిలోపాధి రాకాశకల్పః।
రవిర్లోక చేష్టానిమిత్తం యథాయ।
స్సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥

ఈశ్లోకములు కడుసులభములై బ్రహ్మజ్ఞానమును జేతిలోని యుసిరికకాయవలె విస్పష్టార్థముగాఁ జేయుచున్నందున, శంకరుఁడీ బాలకునకు హస్తామలకుఁడని పేరిడి, ప్రభాకరునితో "ఈకిశోర విగ్రహమున సమగ్రమైన బ్రహ్మానుభూతియమరి

యున్నది. ఉపదేశ నిరపేక్షకముగానే, బ్రహ్మజ్ఞాన మధిగమించుటకు, ఈతఁడు తొలంటి జన్మముననే సంసిద్ధిఁబొందినవాఁడుగానుండవలెను. ఇతఁడు ఇఁక బహిః ప్రవృత్తుఁడగుట యసాధ్య' మని చెప్పి హస్తామలకుఁడు దన శిష్యుఁడుగా నుండుట కంగీకరించెను. శంకరుఁడు తదనంతరము శృంగేరికి వచ్చి యక్కడ శారదాపీఠమును గల్పించి మఠము నొక్కటి ఏర్పాటుగావించెను. శృంగగిరి యనునది తుంగానదీ తీరమున నున్నది. ఇది ఋశ్యశృంగుని తండ్రియైన విభాండకునియొక్క యాశ్రమము. ఈయాశ్రమము కేవలపుణ్యప్రదేశమని సరస్వతి దేవి కోరఁగా శంకరుఁడు శారదాసంస్థాపన యక్కడఁగావించెనని చిద్విలాసుని గ్రంథమున నున్నది. బౌద్ధమత మీప్రాంతమునఁ బ్రబలియుండెననియు, నిక్కడ మఠ మొక్కఁడున్నఁగాని తన్నిర్మూలముగావింప సాధ్యముగాదని శంకరుఁడు తన ముఖ్యపీఠము నిక్కడ స్థాపించెననియు, నాధునికులనుచున్నారు.

## దశమాధ్యాయము.

సూత్రభాష్యమునకు వార్తికము.

వేదాంత సూత్రములకుఁ దానువ్రాసిన (శారీరక మీమాంసా) భాష్యము మిక్కిలి కఠినమై సామాన్యజనులకు దురవగాహముగా నున్నందున, దానికిఁ డీక యొక్కటి యుండుట యావశ్యకమని శంకరునికిఁ జిరకాలము క్రింద స్ఫురించి యుండెను. కావునఁ దనశిష్యుఁడు సురేశ్వరుఁడు భాష్యమునకుఁ డీకవ్రాయుమనని వేఁడఁగా, ఈతఁడు తత్కార్యమునకుఁ దగిన మహాపండితుఁడని శంకరుఁడు నిశ్శంకముగా నంగీకరించెను. ఇదియెఱిఁగి తక్కిన శిష్యులు పద్మపాదుని బురస్కరించికొని, శంకరుని సమీపించి "స్వామీ! తమ భాష్యమునకుఁ డీకవ్రాయఁదగిన వాఁడు పద్మపాదుఁడే. ఇతఁడు ప్రభాకరమత మునఁ బుట్టినవాఁడయ్యుఁ జిన్నతనముననే తమకు శిష్యుఁడై మీయొద్దఁ జాలఁగాలము శ్రవణము గావించియున్న కారణ మున, మీయభిప్రాయములు చక్కఁగా నభివ్యక్తి పఱుపఁ గలఁడు. ఇదిగాక, బ్రహ్మచర్యమునుండియే సన్న్యసించి యుండు టనుబట్టి ధారణాశక్తియు నితనికి అధికముగా నున్నది. మండనుఁడు పండితుఁడయ్యును బెక్కుకాలము పూర్వమీ మాంసా శాస్త్రమును అభిమానించినవాఁడు. కొంతకాలము గృహస్థుఁడుగాఁగూడ నుండెను. మీవలన వాదమున నోడింపఁ

బడి మీకుశిష్యుఁడయ్యెఁగాని, యాతని హృదయమున అద్వైతమతాభిమానము కలదో లేదో నిర్ణయించుటకు శక్యము కాదు. అతఁడు వ్రాయుటీకవలనఁ దమయభిప్రాయములు చక్కఁగా వెల్లడియగునో కావో తెలియరాదు. సూత్రభాష్యమునకు ఎల్లవిధములఁ డీకవ్రాయఁ దగినవాఁడు పద్మపాదుఁడే.'' యని విన్నవించిరి. పద్మపాదుఁడు ఈ ప్రసంగమున నుదాసీనుఁడు వోలె ''ఆనందగిరియో - లేక హస్తామలకుఁడో ఈపనిచేయఁ దగినవా''రని విన్నవించి యూరకుండెను. మండనమిశ్రునితోడి వాదమందు అతనిశక్తి యామూలాగ్రము గన్నొన్నవాఁడు కావున తనభాష్యమునకు సురేశ్వరుని టీకయే సర్వవిధముల సముచితముగా నుండునని యభిప్రాయపడియు శంకరుఁడు శిష్యులలోఁ బెక్కండ్ర యిష్టమునకు విరుద్ధముగాఁ బోనేరక సూత్రనిబంధనము పద్మపాదుఁడే వ్రాయుట కంగీకరించి, సురేశ్వరునకుఁ దైత్తిరీయ కాణ్వోపనిషత్తులకు వార్తికము వ్రాయ ననుజ్ఞయొసఁగెను. పద్మపాదుఁడు మిక్కిలి గురుభక్తి గలవాఁడనుట కేమాత్రము సందేహము లేదు. కాకున్న గంగా ప్రవాహముమీఁద నేలమీఁదఁబోలె నడవఁగలిగెనా? కాని విద్యావంతులలోఁ బెక్కండ్రకు సామాన్యమైన గర్వము ఈతనినిగూడ బాధించుచుండెను. ఒకపరి ఈతఁడు ఆనందగిరిని దూలనాడుటవిని శంకరుఁడు ఆనందగిరికి ఆధిక్యము వెలయించు నిమిత్తము స్వకటాక్షమాత్రమునఁ జతుర్దశ విద్యలలోఁ బ్రాఢికలుగఁజేసినట్లు కథకలదు. తోటకాచార్యులను పేరుతో స్మార్త గురుపరంపరలోనున్నవాఁడు ఈ ఆనందగిరియే.

పద్మపాదుఁడు భాష్యమునకుఁ డీకనువ్రాసిన కొన్ని దినములకుఁ దనపాండిత్యమును జన్మదేశమునందుఁ బ్రకటించుకొనుటకుఁ గాఁబోలు శంకరునివలన నెట్లో యనుజ్ఞఁగైకొని దక్షిణదేశమునఁ దీర్థయాత్ర సలుపనేగెను. శంకరుఁడును

శంకరుఁడు మాతృసందర్శనమునకుఁ బోవుట.

స్వదేశమునఁ దనతల్లి రోగపీడితురాలై యున్నదని యెఱిఁగి శృంగగిరినుండి గగనమార్గమునఁ గాలటికిబోయి, మాతృసన్నిధానమున నవతీర్ణుఁడై యామెచరణములకుఁ బ్రణమిల్లెను. ఎనిమిదవ యేఁడు వెళ్ళకముందే, తన్నువదలి అతిక్లేశకరమైన సన్న్యాస ధర్మమును స్వీకరించి దేశాటనము చేయుచున్న కుమారుని దిగ్విజయాది వార్తలు కర్ణాకర్ణిగ నాకర్ణించుటయె గాని, యెన్నఁడుగాని మరల నాయనను జూడఁ గలుగుదునని కలయందేనిఁ దలంపని తనపుత్రరత్నము, తనయనుంగుఁగుఱ్ఱ, తనప్రాణపదము, తొల్లి తనకుఁ జేసిన వాగ్దానము ప్రకారము తనయెదుటఁ గల్పవృక్షమువోలె సాక్షాత్కరింపఁగా నాసతీమతల్లి క్షణమాత్రమునఁ బునర్జన్మమెత్తినదివోలెఁ దనశరీరతాపముల నెల్లమఱచి ప్రేమాతిరేకమునఁ బుత్త్రుని గౌఁగిలించికొని, శిరంబుమూర్కొని, ఆనందాశ్రువుల నాయన వదనారవిందంబు దడుపుచు సంతోషభరమున గద్గదకంఠియై పలువిధముల నాతనిక్షేమములఁ గూర్చి ప్రశ్నింపసాగెను. శంకరుఁడును ఆమెకు అవసానకాలమాసన్నమై యుండుటయెఱిఁగి, తానువచ్చినపనిఁ దెలిపి మోహనిర్మూలన హేతువులయిన వైరాగ్య వాక్యములచే

నామె భ్రాంతి నిరవశేషము గావించెను. ఇట్లుతనతల్లిని బర మార్థ దర్శనమున కభిముఖిని గావించి, వేదాంత ప్రతిపాద్య మైన నిర్గుణ బ్రహ్మతత్త్వము శంకరుఁడు ఆమెకు బోధింపఁ దొడఁగెనుగాని, ఆమె యాభావముల గ్రహింపనేరక తనకు సగుణభావ ముపదేశింపుమని యాయనను వేఁడుకొనెను. శంకరుఁడు తత్క్షణము శివునిఁ బ్రార్థింపఁగా, నామెయెదుట త్రిశూల పినాకాయుధ ధరులైన శివుని దూతలుప్రత్యక్షమైరి. కాని తల్లోకమునకుఁ బోవుటకు ఆమె యిష్టపడదయ్యె. ఆవల శంకరుఁడు శ్లోకత్రయముచేత విష్ణువును స్తుతించి యాయన జగన్మోహన స్వరూపమును దనతల్లి చిత్తమందు స్ఫురింపఁ జేసెను.

"శ్లో॥ భుజగాధిపభోగతల్పభాజం।
కమలాంకస్థల కల్పితాంఘ్రిమూలం।
అభివీజిత మాదరేణనీలా।
వసుధాభ్యాం చలమాన చామరాభ్యాం॥

శ్లో॥ విహితాంజలినానిషేవ్యమాణం।
వినతానంద కృతాగ్రతోరథేన।
ధృతమూర్తిభి రస్త్రదేవతాభిః।
పరితఃపంచభి రంచితోపకంఠం॥

శ్లో॥ మహనీయతమాల కోమలాంగం।
ముకుటీరత్నచయం మహార్ఘ్యయాంతం।
శశిరేతరభాను కీలితాగ్రం।
హరినీలోపల భూధరం హసంతం॥"

సీ॥ తొడలపై నిడికొని యడుగుఁదమ్ములు ప్రీతి
యొప్పార శ్రీదేవి యొత్తుచుండ,
కదలి యొడ్డాణంపు గరితనము నీళయుఁ
బ్రక్కల వింజామరములవీవ,
అంగీకృతాంసులై యస్త్రదేవతలేవు
రుపకంఠమునఁ గనద్భక్తిఁ జరింప
అనిశ మష్టాక్షరోక్తు నంజలికలితుఁడై
తార్క్ష్యుఁ డందు మౌనుల సంస్తవము నర్ప
తే-గీ. నీలనగశృంగమున హేఁనిలిచెననఁగ।
శిరమున మణికిరీటంబు సెలువుగులుక।
చిలువరాశెజ్జ పన్నుండు నళిననయను।
సురుచిరాకార మెసఁగ మా బ్రోపుఁగాత॥

ఇట్లు అత్యుత్తమమైన చరమ వృత్తితో శంకరుని తల్లి శరీరమును విడిచి సూర్య చంద్ర విద్యుద్వరుణాది లోకముల నతిక్రమించి యోగిజనైక సాధ్యమై యపునరావృత్తి రూపమైన వైకుంఠమును బొందినదయ్యెను.

శంకరుఁడు పూర్వము తన తల్లికిఁ జేసిన వాగ్దానము ప్రకారము మృత శరీరమునకు దహనాదికర్మ దానే గావింపఁ బ్రయత్నించెను. గాని బంధువులు ఇందు కియ్యకొనక సన్న్యాసికిఁ గర్మాధికారము లేదని యాక్షేపించుటయేగాక సంస్కారమునకుఁ గావలయు కట్టెలును అగ్నిహోత్రమును గూడ శంకరునకుఁ బుట్టకుండఁ జేసిరి. శంకరుఁడు వారి మూర్ఖతను వదలింప నెంతయో చెప్పి చూచెనుగాని యా

మాటలవలన వారిమనసు కరఁగదయ్యెను. తుదకుఁ గళేబరము కదలించుటకుఁగూడ నాయనకు సాహాయ్యము కన్పట్టకుండెను. అప్పుడు శంకరుఁడు తనతల్లి శరీరమును దానే సందులోనికిఁ గొనితెచ్చి తన యోగమహిమచేత అగ్ని హోత్రమును ఉద్భవిల్లఁజేసి సమంత్రకముగా తల్లిశరీరమునకు ఉత్తరక్రియలు జరిపెను. ఈ పరాభవమునకుఁ గుపితుఁడై శంకరుఁడు కేరళీయులకు వేదాధికారము లేకుండునట్లును, వారి శ్మశానములు గృహోప కంఠములనే యుండునట్లును యతీశ్వరులు వారి ఇండ్లలో భిక్ష చేయకుండునట్లును శపించెను. ఈ శాప ఫలము కేరళీయులకు ఇప్పటికిని అనుభవములోనున్నది.

పద్మపాదుఁడు దక్షిణదేశమున యాత్రగావించుకొని శంకరునియొద్దకు వచ్చెను. శంకరుఁడతని ఖిన్నభావము నుపలక్షించి కారణము నడుగఁగాఁ దన మేనమామ వలనఁదనకైన మహాపకారమును జెప్పి దుఃఖపడసాగెను. ఈ పద్మపాదుఁడు చోళదేశీయుఁడనియుఁ ప్రభాకర మతమందు జనియించిన వాఁడనియు మున్ను చెప్పియుంటిమిగదా! ఈతనియూరు "చిదంబర"మని చిద్విలాసుని గ్రంథమందున్నది. ఈయన దక్షిణదేశ యాత్ర గావించుకాలములోఁ జిదంబరమునకువచ్చి నప్పుడు ఈయన (పూర్వాశ్రమమందు) మేనమామ ఈయన వైదుష్యమునకు మిక్కిలి సంతసిల్లి యనేక విధముల నీతని గౌరవించెను. ప్రస్తావవశమున, నీయన తానురచించిన భాష్య నిబంధనము చదువఁగా, నందీయన యందందు వ్రాసి యున్న ప్రభాకరమత ఖండనాంశములకుఁ గోపపడి సమాధాన

ములఁ జెప్పలేనివాఁడై తన భావములోలోన నడఁచికొని పద్మపాదుఁడు రామేశ్వర యాత్రకుఁ బోయినపుడు భాష్యటీక తన యింటపెట్టి పోఁగాఁ దన యిల్లు కాలిపోయినదన్న వ్యాజమున నీగ్రంథమును జూపులేకుండఁ జేసెను. పద్మపాదుఁడు గ్రంథమును మరల రచియింప నుద్దేశించెనుగాని, మొదటి యూహలు తన హృదయమునకు రాకున్నందునఁ దన ప్రయత్నమంతయు నిట్లు విఫలమగుటకుఁ జింతిల్లి యీవృత్తాంతము శంకరునకు నివేదించెను. శంకరుఁడు భాష్యటీక శృంగగిరియందు ఒక్కపరి శిష్యుఁడు చదువఁగా వినియుండెను. ఆధారణవలన, పోయిన గ్రంథమెల్ల ఉన్నదున్నట్లు తనకుఁ గంఠస్థముగాఁగా పద్మపాదుని దానిని వ్రాసికొనుమని వార్తికమును శంకరుఁడు మరల సముద్ధరించెను:—ఇట్లే రాజశేఖరుని నాటకములఁ గూడ శంకరుఁ డుజ్జీవింపఁ జేసెనని చెప్పుదురు. ఇందువలన శంకరుని ధారణాశక్తి లోకాతీతమని యేర్పడుచున్నది.

# ఏకాదశాధ్యాయము.

శంకరుఁడు శృంగగిరికి మరల వచ్చెనుగాని యచ్చట విశేషకాల మున్నట్లు కనఁబడదు. దేశమున ముళుకంపల వలెఁ బ్రబలియున్న దుర్మతములనెల్ల ఖండించి, యద్వైత కల్పవృక్షము నాటఁదలఁచినవాఁడై యధిక విభవముతో శిష్య సహస్రము కొలిచిరాఁగా, శంకరుఁడు శృంగగిరి బయలు వెడలెను. ఈయన మొదట సేతుబంధమునకుఁ బోయెను. ఈ దిగ్విజయ యాత్రయందు ఈయన చూడని స్థలములుగాని ఖండింపని మతములుగాని లేవు. ఎక్కడ నెక్కడ విద్వాంసు లున్నట్లు ప్రతీతియో అక్కడికెల్ల వెళ్లుచుండెను. ఏవి పుణ్యస్థలములో, వానినెల్ల సేవించుచుండెను. ఏవి పుణ్యతీర్థములో వానిలోనెల్లఁ గ్రుంకుచుండెను. కొన్ని దురాచారముల మునుముట్ట రూపుమాపియు, గొన్నింటిలోని లోపములఁ బాపియు, మఱికొన్నింటి యభిప్రాయములు తెలిపి పరిశుద్ధ పఱిచియు, శంకరుఁడు సంస్కార మొనర్చుచుండెను. ఈప్రకార మీయన సంచార మొనర్చిన దేశములలో, పాండ్య, చోళ, ద్రవిడ, విదర్భ, కర్ణాటక, ఆంధ్ర దేశములు చేరియున్నవి. ఇక్కడఁ గర్ణాటక దేశములోనే యీయన క్రకచుఁడను భైరవోపాసకునిఁ జంపించినది. ఈ ప్రకారము ప్రాగ్దేశములనెల్ల సంచరించి శంకరుఁడు మరల గోకర్ణమునకు వచ్చెను. అక్కడ నీయన జయించిన వారిలోనెల్ల నీల

కంఠపండితుఁడు ప్రశస్తుఁడు. బ్రహ్మసూత్రములకు శైవ భాష్యము వ్రాసిన యతనింత మహిమయుఁ జూపలేకపోయెఁడే. ఆవల సౌరాష్ట్ర దేశముమీఁదుగా శంకరుఁడు ద్వారకకువచ్చి యం దుండి ఉజ్జయినీ పట్టణమునకుఁ బోయెను. ఇక్కడ భట్ట భాస్కరునకును శంకరునకును ఘోరమైన వివాదముజరిగెను. శంకరుని వాదము ప్రబలమై భాస్కరుఁడీతనికి శిష్యుఁడ య్యెను. బాణమయూరాదు లీయన భాష్యము నంగీకరించిరి. బాహ్లీక కురు పాంచాల శూరసేనాది దేశములును ఈయనకు లోఁబడిన వయ్యెను. ఇట్లు నైమిశారణ్యమునను, దత్ప్రాంత దేశములయందును దనభాష్యమును వెల్లడించి ఖండనకారుని శ్రీహర్ష మహాకవిని వశీకరించుకొని 'కామరూప' మను పేరు గల దేశమునకు శంకరుఁడు అరుగుదెంచెను. ఇక్కడ అభినవ గుప్తుఁడను శాక్తుఁడొకఁడు వాదమందు విజితుఁడై ఈయనకు శిష్యుఁడయ్యెను. ఇతఁడు అఖండమైన మంత్రశక్తిగల ఉపాస కుఁడు. బ్రహ్మసూత్రములకు శాక్త భాష్యము వ్రాసిన వాఁడు. శంకరునివలనఁ దనకైన పరాభవము లోపల నడఁచికొని భక్తుఁడు పోలెనటించి, యాయనకు శిష్యుఁడై యాయనతోడ విదేహ కోసలాది దేశముల సంచారము గావించుచు, సమయ మరసి శంకరునిమీఁద శాక్తప్రయోగము కావించెను. ఇందు వలన శంకరునకు ఘోరమైన భగందరాఖ్యరోగము సంభ విల్లి చెప్పరాని క్లేశము సంప్రాప్తమయ్యెను, గాని శరీరాభి మానము మునుముట్టలేని యోగధురంధరుఁడు గావున ఈ బాధలక్ష్యపెట్టక శంకరుఁడు స్వకర్మాదికము ఎప్పటియట్లు

నెఱవేర్చుకొనుచుండెను. శిష్యులిందుకు ఖిన్నులై శంకరుని బలవంతపెట్టి యన్నియో యౌషధములు సేవింపఁజేసిరిగాని, వానివలన రోగము నెమ్మదికాకుండెను. ఇట్లు కొంతకాలము జరుగఁగా, ఇది అభినవగుప్తుని యభిచార కరణమువలననైన రోగమని పద్మపాదునకు స్ఫురించెను. ఆతఁడు శీఘ్రకాలమునఁ దన మంత్రబలమున నీప్రయోగమునకుఁ బ్రతిక్రియ కావించెను. శంకరునకు బాధ నివర్తించుకొలఁది, అభినవగుప్తున కది ప్రాప్తమై శంకరుఁడు పూర్తిగా నారోగ్య మొందునంతకు అభినవగుప్తుఁడు చిత్రగుప్తుని సాన్నిధ్యము చేరవలసినవాఁడయ్యెను.

ఈ దిగ్విజయకాలములో, శృంగేరియందుమాత్రమే గాక, ద్వారకయొద్దను, బదరికాశ్రమమందును జగన్నాథక్షేత్రమందును, శంకరుఁడు మఠములు ప్రతిష్ఠించి, యక్కడఁ దనశిష్యులలో, విద్యాధికులైనవారిని పీఠాధిపతులుగానియమించెను. ఇంతియగాక, పెక్కెడల, శ్రీ చక్ర ప్రతిష్ఠాపనము గావించి, దేవాలయములకుఁ బూర్వమున్న మహిమకన్న నధికమగు మహిమ వెలయునట్లు చేసెను. ఇట్లు శంకరుని సందర్శన భాగ్యమును బొందిన దేవాలయములలో గాంచీపట్టణములోని కామాక్షీ దేవాలయము మిక్కిలి ప్రశస్తమైనది. ఇక్కడ శంకరుఁడు ఒక నెలదినములు నిలిచి, శివకాంచి, విష్ణుకాంచియని కాంచీపురమును రెండు భాగములుగా నిర్మింపఁజేసి, తాంత్రికుల నివారించి కామాక్షీ దేవాలయములో శ్రుతిసమ్మతమైన పూజావిధానముఁ బ్రతిష్ఠించెను. ఈ కార్యమున

సీయనకు రాజసేనుఁడను రాజు సహాయ మయ్యెనని చిద్విలాసుని గ్రంథమందున్నది.

శంకరుఁడు ఖండించిన మతములు అసంఖ్యములు. శంకరుఁడవతరించు నప్పటికి వేదమందుఁ బ్రతిపాదింపఁబడి యున్న శుద్ధాద్వైత మనుగంటి యొకకోటిమతము లుప్పతిల్లి యుండెను. కర్మమార్గమను పేర, యజ్ఞములు. హయమేధ ములు, తుదకు నరమేధములుగూడ దేశమందెల్లఁ బ్రబలి యుండెను. శాక్తమత మను పేర, మద్యమాంసాది సేవనము ఉత్తరదేశమున సార్వత్రికముగా వర్ధిల్లుచుండెను. బుద్ధుఁడు చనిపోయినతర్వాత, ఆయన శిష్యులు తన్మతమును జక్కఁగా గ్రహింపనేరక, దేశమందెల్ల శూన్యవాదము (దేవుఁడు లేఁడను వాదము) ను నిరాతంకముగా బోధించుచుండిరి. ఇఁక, సూర్యుఁడే దేవుఁడని కొందఱు, (సౌరమతము) చంద్రుఁడే దేవుఁడని కొందఱు (చాంద్రమతము), పశుపతియే దేవుఁడని కొందఱు (పాశుపతమతము), గణపతియే దేవుఁడని కొందఱు (గాణాపత్యము), వేఱేల దృగ్గోచరమగు పదార్థ ములలో నొక్కొక్కదానినిఁ బురస్కరించికొని యొక్కొక్కఁ డొక్కొక్క దేవుని సృజించి అందుకుఁ బ్రమాణముగ వేద మందలి వాక్యములు గొందఱును, స్మృతివాక్యములు కొంద ఱును, పురాణేతిహాసములలోని వాక్యములు గొందఱును ఉదాహరించుచు తమలోఁ దమకుఁగల భేదములు సరిపఱుచు కొనఁజాలక యసూయా పరాయణులై ఘోరకార్యములఁ గావించుచుండిరి. వీని నెల్ల నొక్కప్రక్కకుఁ దెచ్చుటకు

సర్వజ్ఞునకుఁ గాక సాధ్యమగునా? శంకరుఁడు, అన్యమత ఖండనము గావించు విధమునుగూర్చి ఆనందగిరి గ్రంథమందుఁ గొంత సూచనయున్నది. ఇప్పటి క్రైస్తవ మతోపన్యాసకుల వలె నక్షరజ్ఞానము లేని మూఢుల యొద్దకుఁబోయి లోకములోఁ గ్రీస్తుతక్క వేఱొక్క దేవుఁడులేఁడనియుఁ, గ్రైస్తవ మతముకన్న నుత్తమమతము వేఱొకటి లేదనియుఁజెప్పి వారిని లోఁబఱచికొనుటయందుఁ గాలము వ్యర్థపుచ్చక శంకరుఁడేమతము నిరాకరింపఁదలఁచెనో ఆమతము గురువునొద్దకుఁ బోయెడువాఁడు. పోయి, వారిప్రమాణములను, వారియుక్తులను, వారియభ్యాసములను గనుఁగొని, యెంతవఱకుఁ దాను వానినంగీకరింపఁగలఁడో తెలిపి, వానిని ఆధారములుగాఁ గొని, తక్కినవాని విషయమున వారితోఁ దర్కించువాఁడు. దురవగాహములైన యుక్తులుగల సాంఖ్యవైశేషికాది మతములు గాక, తక్కినవెల్ల శంకరునకుఁ దృణప్రాయములుగానుండెను. ఈమతాభిమానులు (సౌర, మాహేశ్వర, వీరశైవాదులు) కొందఱు పురాణములఁ బ్రమాణీకరించికొనియుండిరి. కొందఱు స్మృతులఁ బ్రమాణీకరించుకొనియుండిరి. ఇట్టివారికెల్ల పురాణములకన్న స్మృతులు బలవత్తరములనియు, స్మృతులకన్న శ్రుతులు బలవత్తరములనియుఁ జూపి చెప్పి వారి నొక్కకడకుఁ దెచ్చి, వేదముయొక్కయు వేదాంతములయొక్కయు పరమాభిప్రాయమును శంకరుఁడు వారలకుఁ బ్రతిబోధించుచుండెను. వేదప్రామాణ్యము నమ్ము వారలలోఁగూడ, అభిప్రాయ భేదము లనేకము లుండెను. సౌరులు "ఆదిత్యో

బ్రహ్మ" యనువాక్యము నుదాహరించి సూర్యున కన్న భిన్నమైన బ్రహ్మము లేదనిరి. ఇట్లే యితరులును. శంకరుఁడు ఈ మతాభిమానులను.

" శ్రుతి ॥ నతత్ర సూర్యోభాతి నచంద్రతారకం ।
నేమా విద్యుతో భాంతి కుతోయమగ్నిః ।
తమేవ భాంత మనుభాతిసర్వం ।
తస్యభాసాసర్వమిదం విభాతి ॥ "

తాత్పర్యము ॥ అపరబ్రహ్మముకడ, సూర్యుఁడుఁ ప్రకాశింపఁడు. నక్షత్రములు ప్రకాశింపవు. మెఱపుఁ దీఁగెలు ప్రకాశింపవు. ఇఁక నీ యగ్నిహోత్రుఁ డెంతటి వాఁడు? సూర్యచంద్ర నక్షత్ర విద్యుద్వహ్ని ప్రముఖమయిన సర్వమును, అపర బ్రహ్మ ప్రకాశము ననుసరించి ప్రకాశించుచున్నది.

" శ్రుతి ॥ య ఆదిత్యేతిష్ఠ, న్నాదిత్యాదంతరో యమాదిత్యోన వేద, యస్యాదిత్యశ్శరీరం, య ఆదిత్యమంతరోయమయత్యే షతఆత్మాంతర్యామ్యమృతః ॥ "

తాత్పర్యము ॥ ఎవ్వఁడాదిత్య దేవత యందుండి యాదేవతకంటె భిన్నుఁడై యున్నాఁడో, యెవ్వని నాదిత్యదేవత తెలియక యున్నాఁడో, యాదిత్యుఁ డెవ్వని శరీరమో, యెవ్వఁడాదిత్యాంతః పాతియై వాని నియమించు చున్నాఁడో, వాఁడే నీయాత్మ. వాఁడు సర్వాంతర్యామియు నమృతుఁడునై యున్నాఁడు.

" గీతాస్మృతి॥ నతద్భాసయతే సూర్యో - నశశాంకో నపావకః ।
యద్గత్వా ననివర్తంతే - తద్ధామ పరమంమమ ॥

తాత్పర్యము ॥ దేనిని, సూర్య చంద్రాగ్నులలో నెవ్వరుగాని ప్రకాశింపఁ జేయఁజాలరో, ఏది పొందినపిదప మరలఁ దిరిగివచ్చుట లేదో, అదియే నాస్థానము.

ఇత్యాద్యర్థముగల యుత్తరవేద వాక్యములలో వెనుకటి వారు చేసినయర్థములు ప్రకరణ విరుద్ధములగుటవలన గ్రాహ్యములుకావని వారికి బోధించుచుండెను. ఈప్రకరణములలో సూర్యుఁడు బ్రహ్మమెట్లగును? బ్రహ్మము వాఙ్మనస గోచరము. సూర్యుఁడు నేత్రగోచరుఁడు.

'చంద్రమా మనసో జాతః ।
సూర్యస్తస్య తు చక్షుషః ॥

ఇట్టిపదార్థము బ్రహ్మమెట్లగును? ఇట్లు ప్రబోధితులైన వారలలో గుణానురాగముగలవారు శంకరుని సిద్ధాంతమందలి సత్యమొప్పికొనుచుండిరి. కొంద అసూయాగ్రస్తులు అభినవగుప్తుని వలెను గ్రకచునివలెను నటించి యనురూపమైన ఫలము నందుచుండిరి. వేదవిశ్వాసముగల వారితోఁ గాక, శంకరుఁడు వేదములు నమ్మని పెక్కండ్రు పాషండులతోఁ గూడ వాదింపవలసియుండెను. ఇట్టివారిలో బౌద్ధులలో నొక్క తెగవారు మాధ్యమికులు ముఖ్యులు. తీవ్రమైన యెట్టి యుక్తులతో నీవైనాశిక తంత్రమును శంకరుఁడు వినాశము గావించెనో సూత్రభాష్యము చూచిన సుస్పష్టము గాఁగలదు.

# ద్వాదశాధ్యాయము.

విద్వాంసులతోడ వాదించి స్వమత స్థాపనము చేసికొను కాలము తప్పఁ దక్కిన కాలమంతయు శంకరుఁడు బ్రహ్మాను సంధానమందు వినియోగించుచుండెను. హిమవత్పర్వత శిఖరములలో స్వర్గ గంగాతీరమున నీయన బ్రహ్మాను సంధానము చేసికొనుచున్న కాలములో, ఒకపరి ఈయనకు గౌడపాదుఁడు దర్శనమిచ్చినట్లు మాధవీయమందుఁ జెప్పఁబడియున్నది. అద్వైత సంప్రదాయమును భూలోకమున వ్యాప్తికిఁ దెచ్చిన వారిలో గౌడపాదుఁ డగ్రగణ్యుఁడు. శంకరునకుఁ బరమ గురువు. బ్రహ్మవిద్యను సాక్షాచ్ఛుక మహర్షి ముఖమునుండి గ్రహియించినవాఁడు. తన కారికకు (మాండూక్యోపనిషత్కారికకు) శంకరుఁడు వ్రాసిన టీకను బరీక్షించి తనయభిప్రాయముల నిరవద్యముగా గ్రహించినందుకు సంతసించి శంకరుని అనేక విధముల నభినందించి యీయన యంతర్ధానమొందెను.

### సర్వజ్ఞ పీఠారోహణము.

ఇట్లు స్వర్ణదీ తీరమున నసంగుఁడై బ్రహ్మనిష్ఠయందు శంకరుఁడు కాలముగడపుచుండగాఁ గౌతుకకరమైన యొక్క వార్త మృగమద పరిమళమువలె లోకమెల్ల నల్లికొనుచుండెను. కాశ్మీర దేశమున శారదాధిష్ఠితమైన దేవాలయముగలదు. అచ్చట సర్వజ్ఞ పీఠమున్నది. ఈమంటపమునకు నాల్గు దిక్కుల

నాల్గు ద్వారములుగలవు. తూర్పునను, ఉత్తరమునను, బడమటను ఉన్న ద్వారములు తెఱవఁబడియున్నవి. దక్షిణ ద్వారము మాత్రము మూయఁబడియున్నది. సర్వజ్ఞత్వసిద్ధి కలవాఁడుగాని ఈ ద్వారమును దెఱవలేఁడఁట. ఇదివఱకు దాక్షిణాత్యులు పెక్కండ్రక్కడకువచ్చి యక్కడి పండితులచేఁ బరాభూతులై పోయిరి. ఈ వార్త యట్లో శిష్యుల చెవినిబడి శిష్యులు విన్నవింపఁగా, దాక్షిణాత్యుల యపయశస్సు నపాకరింపనెంచిన వాఁడై శంకరుఁడు సర్వజ్ఞపీఠారోహణము గోఱకుఁ గాశ్మీర దేశమునకు బయలువెడలెను. ఈప్రస్థానము మిక్కిలి వైభవముతోఁ గూడియుండెను. అసంఖ్యులైన శిష్యులు స్తోత్ర పాఠములు చదువుచు శంకరుని వెంట వచ్చుచుండిరి.

శ్లో॥ వాదివ్రాత గజేంద్ర దుర్మద ఘటాదుర్గర్వ సంకర్షణః ।
శ్రీమచ్ఛంకర దేశికేంద్ర మృగరా డాయాతి సర్వార్థవిత్ ।
దూరంగచ్ఛత వాదిదుశ్శర గజాస్స న్యాస్యసదంష్ట్రాయుధో
వేదాంతోరు వనాశ్రయ స్త దపరం త్రైతం వనంభక్షతి ॥

మ॥ అరివేదండ విఖండనక్షమము, వేదాంతాటవీ స్వైరసం ।
చరణప్రౌఢము, శంకరార్యయతి పంచాస్యంబిదేవచ్చెడుక్ ;
దరలుండోలి, ద్విషన్మదేభములు; సన్న్యాసోగ్రదంష్ట్రాయుధ ।
త్వర, సర్వజ్ఞము తన్మృగేంద్రము మిముక్ దారించునిందున్నచోక్

చ॥ కరటతటాంతవాంత మదగంధవిలోల మదద్విరేఫసుం ।
దరతర కాకలీ విరచితశ్రవణోత్సవమైన గంధసిం ।
ధురమునుగాక సింహము గనుంగొన దట్టె; దురంతశక్తి శం ।
కరుఁడు గణింపఁడింతయు సృగాలనిభాల్ప బలారిపక్షముల్ ॥

దిగ్దేశాగతులైన జనులు లక్షలకొలఁది గుంపులుగూడి చూచుచుండిరి. ఇట్లు శారదా పీఠమును దరిసి, నిరాతంకముగా శంకరుని శిష్యులు దక్షిణకవాటము నుద్ఘాటింప సాగిరి. అత్యంత సాహసికమైన యీ వృత్తమునుజూచి యక్కడి పండితులు శంకరుని వాదభిక్ష కాహ్వానముచేసి తమ తమ మతముల నాయనతో వాదింపఁ దలపడిరి కాని శంకరుఁడు వారినందఱ నోడించెను. వారి వాదములు బాలభానూదయమునఁ గరఁగిపోవు ప్రాలేయశిలలవలె విరిసిపోయెను. ఇట్లు విమత విద్వాంసుల గర్వమెల్ల నిర్మూలముచేసి దక్షిణ ద్వారము భేదించి శంకరుఁడు సర్వజ్ఞ పీఠము నారోహింపఁబోఁగా అశరీరమైన యొక్క వాక్కు వినవచ్చెను. "ఓహో! సాహసింపకుము. కేవల సర్వజ్ఞతా మాత్రమున నీపీఠ మారోహింపరాదు. పరిపూర్ణ ధర్మనిష్ఠ కూడఁగావలయును. నీవు సన్న్యాసివయ్యు అనంగశాస్త్రనిమిత్త మంగనాసంగము కావించిన వాఁడవు. కావున నపరిశుద్ధుఁడవు" ఈవాక్కు తత్పీఠ వాసినియైన సరస్వతీ దేవిది. దీనికి శంకరుఁడు బ్రహ్మవిత్సమ్మతమై రహస్యమై త్రైవర్గికుల కజ్ఞేయమైన పరమసమాధానమును జెప్పి దేవిని నిరుత్తరఁ గావించి అనన్య సాధ్యమైన సర్వజ్ఞ పీఠము సర్వాశ్చర్యకరముగా నారోహించెను. తక్కిన పండితులందఱును శిష్యకల్పులై శంకరుని బలు తెఱంగులఁ బ్రశంసించిరి. గీర్వాణులు పుష్పవృష్టి గురిసిరి. సర్వజ్ఞ పీఠారోహణము శంకరుఁడు కావించిన కార్యములలోనెల్ల మిక్కిలి దుష్కరమైన కార్యముగా నెన్నఁబడుచున్నది.

శంకరుఁడు తానునిర్మించిన శృంగేర్యాది పీఠములలో నాధిపత్యమునకు యుక్తశిష్యులను నియోగించి తాను సర్వజ్ఞ పీఠమును వదలి కొందఱు శిష్యులను మాత్రము వెంటఁబెట్టు కొని బదరి కాశ్రమమునకుఁ బోయెను. అక్కడ నల్పకాల ముండి, ఆవలఁ గేదార తీర్థమునకుఁ బోయెను. అక్కడ ముప్పది రెండవయేఁట, ఇఁకఁగర్తవ్య శేషములేదని దేవత లచేఁ బ్రబోధింపఁబడినవాఁడై లీలాగృహీతమైన మనుష్య శరీరమును వదలి స్వీకృత స్వాకారుఁడై శంకరుఁడు రుద్రపారి షదులు గొలువ బ్రహ్మేంద్రాది సంస్తూయమాన దివ్య వైభ వముతో వృషభ వాహనారూఢుఁడై స్వావాసమైన కైలాస మునకుఁ బోయెను.

## ఉపసంహారము.

హిందూదేశముయొక్క దక్షిణపుఁబ్రక్క నెక్కడనో యొక్క యప్రసిద్ధమైన పల్లెయందు నొకబీద బ్రాహ్మణుని కుటుంబమున జనియించి, సామాన్యులైన బాలురకు మాట లైనరాని యీడునకే, సకలశాస్త్రపారంగతుఁడై దేశమెల్లఁ దిరిగి ముప్పది రెండవ యేఁటిలోన భారతవర్షమునఁ దత్త్వ ప్రతిష్ఠాపనము చేయుటకు శంకరునకుఁగాక యిఁకనెవ్వనికి సాధ్యమగును? ఘోరాకారములుగల దేవతల నుపాసించి భావనాబలమునఁ దద్దేవతా తాదాత్మ్యమునుబొంది దుష్ప్ర తిజ్ఞులైయున్న శాక్తకాపాలికాదులను నిర్భయముగా దరిసి వారిదుర్వర్తనములను వార్తాశేషములఁజేసి వారినెల్ల సదా

చారవిజయధ్వజము క్రింద నడపింప శంకరునకుఁగాక యింక నెవ్వానికి సాధ్యమగును? విషయభోగ లాలసులై ప్రమత్తులై తనతోడివారు ఉద్యానవనములలోను మణిసౌధములలోను కాంతా సమేతులై విహరించుచుండఁగా, స్వప్రయోజనముల నెల్ల దిగనాడి స్వసౌఖ్యముల నెల్ల నేలఁగలిపికొని, గిరి గుహారణ్యములలో నేకాంతవాసమునఁ జిరకాల నిదిధ్యాసమునఁ దానుబడసిన విజ్ఞానామృత రసమును దయామయమైన హృదయముతో లోకమున వెదచల్ల శంకరునకుఁగాక, ఇఁక నెవ్వరికి సాధ్యమగును? సంసార మహారణ్యమునఁ గాఁడుపడి ఆధ్యాత్మికాదితాపత్రయముచేతఁ దప్తులై ఉదకభ్రాంతిచేత విషయ మృగతృష్ణికలవెంటఁ బరిధావనము చేయుచున్న యజ్ఞాని జనులకు అత్యాసన్నమైన యద్వైత సుధాసముద్రమును వెలిపఱిచి వారి కనిర్వచనీయమైన యానందమును గల్పింప శంకరునకుఁగాక యింక నెవ్వనికి సాధ్యమగును?

శంకరుఁడు గడచి చని యిప్పటికి వేయి సంవత్సరములయినది. ఈ లోపల భిన్నాచారములు, భిన్న వేషములు, భిన్నమర్యాదలు, భిన్నమతములుగల యన్యదేశములవారు పెక్కండ్రు వచ్చిరి. దేశములోను సంఖ్యాతీతములైన మార్పులు సంఘటిల్లినవి. కాని క్రైస్తవాది మతములగౌరవము ఆధునిక ప్రకృతిశాస్త్ర సముజ్జృంభణములవలనను, జిజ్ఞాసువుల నిశ్శంక తర్కవిమర్శనములవలనను

లోహంబై,
గ్రావంబై, దృఢదారువై, తరుణవృక్షంబై, ఫలప్రాయమై।
పూవై, తన్మకరందమై, కరఁగెఁబో పోనీళ్లకుం బల్చనై॥

అన్నట్లు కాల క్రమమున సన్నగిల్లుచుండఁగా వాయువర్ష శీతాతపములకుఁ జలింపని మహా పర్వతమువలె శంకరుని యద్వైతసిద్ధాంతము సుస్థిరమై నిలుచుటయగాక, దివ్యజ్ఞాన సమాజమువారి ప్రయత్నములవలనను, శ్రీవివేకానందుని ప్రభావాతిరేకమువలనను పాశ్చాత్య దేశములయందుఁ గూడవ్యాపించి, యక్కడి విద్వాంసులకుఁ దత్త్వజ్ఞులకు నద్భుతమును ఆనందమును గావించుచున్నది. తొల్లి పాశ్చాత్యులు హిందువులన్న, బిడ్డలను రథముల కడ్డము వేయునెడ్డెలుగాను, సతులఁ బతుల చితులపై వైచి బలిమిమై గెంటించు కంటకులుగాను దలంచుచుండిరి. కాని కొందఱి యుదారహృదయుల కరుణవలనను, ప్రాక్ప్రకాశాది (Light of the East) పత్త్రికా ప్రచారముల వలనను, వారాయభిప్రాయమును మార్చికొని, హిందువులుగూడ మానవులేయనియు, వారికిఁగూడ మతమొకఁడున్నదనియుఁ దలంపఁ దొడఁగిరి. ఆవల అమెరికాదేశమునఁ జికాగో పట్టణమున జరిగిన విశ్వమత విమర్శ సభలో (Parliament of Religions) శ్రీ వివేకానందస్వామి యుపన్యసించిన పిదప, తొంటి దురభిప్రాయము మునుముట్ట నడుగంటి, హిందువుల మతము సర్వోన్నతమనియు, వారి వేదశాస్త్రములు సుప్రమాణములనియు, వారి గ్రంథములందు అందందుఁ జూపట్టు ఆకాశ

గమన, పరకాయ ప్రవేశ మృతసంజీవనాది విషయములు కేవల కల్పిత కథలుగాక యోగాచరణ సమధిగమ్యములయిన సిద్ధులనియు, వారియాచారములు స్వస్వరూపానంద ప్రాప్తికిఁ బరంపరాసాధనములుగ నేర్పడ్డకర్మలనియుఁ దలంపఁజొచ్చిరి. ఈయభిప్రాయము ప్రబలుకొలఁది అమెరికాది దేశముల రాజయోగాభ్యాసాది సమాజములును రామకృష్ణాదులపేర దేవాలయములును, సేవా మందిరములును ఉప్పతిల్లుచున్నవి. ఇట్లు పాశ్చాత్యులు గుణగ్రహణ పరాయణులై మనతత్త్వశాస్త్రముల నంగీకరించుచుండఁగా, మన యాచారములఁ బెక్కింటిఁ బరిగ్రహించుచుండఁగా, మనవారు వానినివదలి యుక్తాయుక్తము లెఱుఁగక, మునుముట్ట మనశాస్త్రములఁ దూలనాడువారును, మన యాచారములఁ దిరస్కరించువారునై కొందఱు పాశ్చాత్యులతోడ సారూప్యమును బొందువారును. మఱికొందఱు వారితోడ సాయుజ్యమును గోరువారునై యాత్మజాతీయ గౌరవమును బోఁగొట్టికొనుట యెంతయు శోచనీయమ్ముగాదే ?

శంకరునిమతమున నిరతిశయమై శాశ్వతమైన యానందమునకే బ్రహ్మమని పేరు. తెలిసియైనఁ దెలియకయైన మన మందఱ మన్వేషించునది యాబ్రహ్మమునే. అట్టిబ్రహ్మము స్వతస్సిద్ధమైనను, పురుషుని చిత్తముననున్న యవిద్యచేతఁ దిరోభూతమైయున్నది. ఈయవిద్య (1) మల (2) విక్షేప (3) తిరోధానములను మూఁడురూపములుగానున్నది. ఈ ప్రతిబంధము నివర్తించినఁ గాని స్వరూపమయిన యానంద

మభివ్యక్తముకానేరదు. 'మల' మనఁగా నిషిద్ధములయిన పరాంగనాసంగమాది కర్మలయందు ఆసక్తిఁగలిగించు చిత్తవృత్తి. 'విక్షేప' మన నొక్కచో నిలువనీయక చిత్తమును బలుతెఱఁగులఁ బరిభ్రమింపఁజేయునది. ఇకఁ 'దిరోధాన' మన నజ్ఞానము; స్వరూపమును మఱుఁగుపఱుచునది. ఇందు నిష్కామకర్మ అనఁగా ఫలకాంక్షారహితముగాఁ జేయుకర్మ వలనఁ గాక మలనివృత్తికానేరదు. ఉపాసనాసాధ్యమగు చిత్తైకాగ్రతవలనఁ గాక విక్షేపమునశింపదు. బ్రహ్మవిచారము వలనఁ గాక తిరోధానము తిరోహితముగాదు. తత్త్వమీరీతి నున్కి పరీక్షించి 'సర్వభూతహితరతు' లైనయార్యులు వర్ణాశ్రమములకు ఉచితమైన యాచారములఁ గల్పించి తన్మూలమునఁ జిత్తశుద్ధి గలిగి క్రమముగా నందఱును బ్రహ్మానుభూతి రసికులగు విధానమ్ము నేర్పఱిచిరి. కాని దేశకాలములయందలి మార్పులచేత ధర్మము యథానిర్దిష్టముగా జరుగనందున, నియ్యెడ నెవ్వరికి వారు స్వతంత్రులై యెవ్వని త్రోవ వానిదిగా శాస్త్రములకుఁ బూర్వులు చెప్పిన యర్థములు సరికావని కొందఱును, సరియైనను, అవి యాతయామములని కొందఱును, శాస్త్రములతోడ నావశ్యకతయే లేదని యిఁకఁగొందఱును, దేశమున నఖండకోలాహలముగా సభలలోను బత్త్రికలలోను వాదించుకొనుచున్నారు. ఇప్పుడు ప్రవృత్తములగుచున్న సంస్కారములవలనఁ జిత్తశుద్ధి ఘటిల్లునో, చిత్తమాలిన్యమే ఘటిల్లునో, చిత్తైకాగ్రతవర్ధిల్లునో, చిత్తవిక్షేపమేవర్ధిల్లునో, జ్ఞాన ముదయించునో గాక మహా